జైత్ర
మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్

PRGI NO TGTEL/26/A2948

జ్యోతి శ్వేత
JYYOTHI SHWETHA
దినపత్రిక

హైదరాబాద్ ‖సంపుటి:1 ‖ సంచిక: 45 ‖ సోమవారం ‖ 13-7-2026 ‖ పేజీలు: 8 ‖ వెల 3/-

13 జూలై 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:53 సూర్యాస్తమయం - సా. 6:50 తిథి చతుర్దశి సా. 6:50 వరకు తరువాత అమావాస్య సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం ఆరుద్ర రా. 2:49౦ వరకు తరువాత పునర్వసు యోగం ధ్రువ మ. 3:57 వరకు కరణం విష్టి ఉ. 8:40 వరకు శకుని సా. 6:50 వరకు వర్జ్యం మ. 1:05 నుండి మ. 2:30 వరకు దుర్ముహూర్తం మ. 12:47 నుండి మ. 1:39 వరకు మ. 3:23 నుండి సా. 4:14 వరకు రాహుకాలం ఉ. 7:30 నుండి ఉ. 9:07 వరకు యమగండం ఉ. 10:44 నుండి మ. 12:21 వరకు గుళికాకాలం మ. 1:59 నుండి మ. 3:36 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:17 నుండి తె. 5:05 వరకు అమృత ఘడియలు సా. 6:01 నుండి రా. 7:26 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:55 నుండి మ. 12:47 వరకు గమనిక: "౦" అనగా మరుసటి రోజున



## అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు ప్రోత్సాహం

### క్రీడాభివృద్ధి చర్యలను వివరించిన రేవంత్ రెడ్డి

**మహిళల క్రీడలపై బీబీసీ అధ్యయన గ్రంథం అందజేత**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని బీబీసీ భారతీయ భాషల విభాగం ప్రచురణ సంస్థ కలెక్టివ్ న్యూస్‌రూమ్ ముఖ్య కార్యనిర్వాహక అధికారి రూపా ఝా, బీబీసీ న్యూస్ తెలుగు సంపాదకుడు జి.ఎస్. రామ్మోహన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహిళల క్రీడలు, క్రీడాకా రిణులు, భారతీయ సమాజంలో మహిళలపై ప్రజల అభిప్రాయాలకు సంబంధించిన అధ్యయన గ్రంథాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు. కలెక్టివ్ న్యూస్‌రూమ్ నిర్వహించిన సర్వే ఆధారంగా రూపొందించిన ఈ గ్రంథం లోని ముఖ్యాంశాలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు.

2

## చార్మినార్ ఏసీపీ భార్య ఆత్మహత్య

అల్వాల్, జూలై 12,
చార్మినార్ ఏసీపీ భార్య ఆత్మహత్యకు పాల్పడింది. అల్వాల్ పోలీసుల కథనం ప్రకారం.. ఏసీపీ చంద్రశేఖర్ భార్య హేమలత (50)తో కలిసి అల్వాల్‌లోని సాయిబాబానగర్ కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరికి వివాహాలైన చంద్రహాస్, గీతాంజలి సంతానం. కుమారుడు తల్లిదండ్రులతో కలిసి ఉంటున్నాడు. వారి భవనంలోనే నగల, దుస్తుల వ్యాపారం నిర్వహించేది. ఆదివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. భర్త చంద్రశేఖర్ ఆమెకు ఫోన్ చేయగా స్పందించకపోవడంతో కుమారుడికి సమాచారం ఇచ్చాడు. కుమారుడు వచ్చి చూడగా అప్పటికే తల్లి గడియపెట్టుకొని ఉరివేసుకుందని గమనించాడు. వాచ్‌మెన్ సాయంతో తలుపు పగలకొట్టి..

(మిగతా 2వ పేజీలో)





## తదుపరి ఎన్నికల్లో మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

### బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు

**పటాన్‌చెరులో రాజకీయ సభ**

- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని పిలుపు
- ప్రభుత్వ పథకాలపై భూముల విక్రయాల ఆరోపణ
- మున్సిపల్ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయాలను ప్రస్తావన
- ఉమ్మడి మెదక్‌లో అన్ని స్థానాలు గెలుస్తామని ధీమా
- కాంగ్రెస్‌కు 9 సీట్లకే పరిమితమవుతుందని వ్యాఖ్య

2

పటాన్‌చెరులో నిర్వహించిన సభలో బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు. ప్రజల్లో మార్పు స్పష్టంగా కనిపిస్తోందని, తదుపరి ఎన్నికల్లో బిఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. స్కామ్‌ల ప్రభుత్వం వెళ్లి, సంక్షేమ పథకాల ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

- పటాన్‌చెరు, జూలై 12,



## కిషన్ రెడ్డి పాదయాత్ర

**అంబర్‌పేట స్వచ్ఛత కార్యక్రమంలో కేంద్ర మంత్రి .. బస్తీలు, కాలనీల్లో ప్రజలతో ముఖాముఖి**

కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆదివారం హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని అంబర్‌పేట డివిజన్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని స్థానికులతో మమేకమయ్యారు. పటేల్‌నగర్ చౌరస్తా, న్యూ పటేల్‌నగర్, చెన్నారెడ్డినగర్ ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టిన కిషన్ రెడ్డి స్థానిక కాలనీలు, బస్తీలను సందర్శించారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, స్థానిక అవసరాలు, అభిప్రాయాలను తెలుసుకున్నారు. - హైదరాబాద్, జూలై 12

## అనంతగిరిలో ట్రెక్కింగ్‌కు వెళ్లి హైదరాబాద్ మహిళ మృతి

ట్రెక్కింగ్‌కు వెళ్లి మహిళ మృతిచెందిన ఘటన వికారాబాద్ జిల్లా అనంతగిరిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ప్రియాంక మోల్ (47).. ట్రెక్కింగ్ చేస్తూ ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. ఆమెను ఆస్పత్రికి తరలించగా అప్పటికే చనిపోయినట్లు వైద్యులు నిర్ధరించారు. హైదరాబాద్‌కు చెందిన ఆమె ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు.



స్థానికులు, మృతురాలి కుటుంబసభ్యులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. వారాంతపు సెలవు కావడంతో హైదరాబాద్‌లోని కంచన్‌బాగ్‌కు చెందిన ప్రియాంక మోల్, మరో ముగ్గురు కుటుంబ సభ్యులు విహారయాత్ర కోసం ఆదివారం ఉదయం అనంతగిరి అటవీ ప్రాంతానికి (మిగతా 2వ పేజీలో)



## రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్

**రేవంత్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు**

**కాంగ్రెస్‌పై ఘాటు ఆరోపణలు**

**తెలంగాణ ఉద్యమాన్ని ప్రస్తావిస్తూ విమర్శలు**

హైదరాబాద్, జూలై 12

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. రైతులు సాగునీటి కోసం ఆందోళన వ్యక్తం చేస్తున్న సమయంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని విమర్శించారు. రైతులకు నీళ్లు అందించాల్సిన ప్రభుత్వం వారిని అవమానించే విధంగా మాట్లాడటం సరికాదని మండిపడ్డారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కేటీఆర్ మాట్లాడుతూ, "నీళ్లు అడిగితే నెత్తురు చల్లుతా" అనే వ్యాఖ్యలు ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తికి తగవని అన్నారు. నీటి కోసం వేడుకుంటున్న రైతులకు పరిష్కారం చూపాల్సింది పోయి, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. రైతుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు.

తెలంగాణ ప్రజలపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చరిత్రను ఎవరూ మర్చిపోలేరని కేటీఆర్ అన్నారు. తెలంగాణ ఉద్యమాల్లో జరిగిన కాల్పులు, ప్రాణత్యాగాలను గుర్తు చేస్తూ, తెలంగాణ ప్రజల రక్తంతో కాంగ్రెస్ పార్టీ చరిత్ర ముడిపడి ఉందని ఆరోపించారు. 1952 ఉద్యమం, 1969 తెలంగాణ ఉద్యమం, మలిదశ తెలంగాణ ఉద్యమాల్లో జరిగిన ఘటనలను (మిగతా 2వ పేజీలో)



## పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన చంద్రబాబు

**ముంబై ఆసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి**

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**

2

# నేటి రాశి ఫలాలు

**మేషం :** లక్ష్యాన్ని దృష్టిలో ఉంచుకొని ముందుకు సాగాలి. వ్యాపారంలో కాలం అనుకూలంగా ఉంది. కీలక విషయాల్లో తోటివారి సలహాలు అవసరం. మనోధైర్యంతో తీసుకున్న నిర్ణయాలు ఫలిస్తాయి. ఉద్యోగంలో అధికారులతో జాగ్రత్త అవసరం. సూర్యారాధన శుభప్రదం.

**వృషభం :** కాలం మిశ్రమంగా ఉంది. మనోబలంతో చేసే పనులు ఫలిస్తాయి. ధైర్యంగా నిర్ణయాలు తీసుకుంటే మేలు జరుగుతుంది. ముఖ్య వ్యవహారాల్లో బంధుమిత్రుల సహకారం లభిస్తుంది. ఆరోగ్యం విషయంలో ప్రత్యేక శ్రద్ధ అవసరం. నవగ్రహ ధ్యాన శ్లోకాలు శుభప్రదం.

**మిథునం :** మనోబలంతో చేసే ప్రయత్నాలు విజయాన్ని ఇస్తాయి. ఉత్సాహంగా ముందుకు సాగితే కాలం సహకరిస్తుంది. ఉద్యోగంలో అనుకున్నది సాధిస్తారు. కుటుంబ సభ్యుల సమస్యలు కొంత ఆందోళన కలిగించవచ్చు. వ్యాపారంలో మంచి అవకాశాలు ఉన్నాయి. సూర్యధ్యానం శుభప్రదం.

**కర్కాటకం :** అనుకున్న పనులు సక్రమంగా పూర్తవుతాయి. మనోధైర్యమే మీకు ప్రధాన బలం. కీలక వ్యవహారాల్లో కుటుంబ సభ్యుల సహకారం మేలు చేస్తుంది. పట్టుదలతో పనిచేస్తే మంచిపేరు వస్తుంది. ఉద్యోగ,వ్యాపారాల్లో అనుభవజ్ఞుల సూచనలు ఉపయోగపడతాయి. నవగ్రహ ఆరాధన శ్రేయస్సును ఇస్తుంది.

**సింహం :** ప్రతి పనిలో పట్టుదల అవసరం. పనులు ఆలస్యం జరగకుండా ముందుచూపుతో వ్యవహరించాలి. ఏకాగ్రత లేకపోతే పని పునరావృతం అవుతుంది. అజాగ్రత్తకు తావివ్వకండి. నవగ్రహ ధ్యాన శ్లోకాలు పఠనం శుభకరం.

**కన్య :** ప్రారంభించిన పనుల్లో జాగ్రత్త అవసరం. బద్ధకించకుండా పనులు వెంటనే పూర్తి చేయాలి. అధికారులను ప్రసన్నం చేసుకునే విధంగా వ్యవహరించాలి. క్రమంగా సమస్యలు తగ్గుముఖం పడతాయి. మనోధైర్యం పెరుగుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం శుభప్రదం.

**తుల :** కాలం శుభప్రదంగా ఉంది. ఏ పని చేసినా త్వరగా పూర్తవుతుంది. సమాజంలో పేరుప్రతిష్ఠలు పెరుగుతాయి. ఉద్యోగ,వ్యాపారాల్లో అనుకున్నది దక్కుతుంది.ఒక సంఘటన మానసిక బలాన్ని పెంచుతుంది. శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆరాధన మేలు చేస్తుంది.


**వృశ్చికం :** ఆర్థిక వ్యవహారాలు లాభిస్తాయి. ఉద్యోగ,వ్యాపారాల్లో శుభఫలితాలు ఉన్నాయి. సౌభాగ్యసిద్ధి కలుగుతుంది. ఒక ముఖ్యమైన సమస్య పరిష్కారం అవుతుంది. సమయానికి సహాయం అందుతుంది. దుర్గాదేవి నామస్మరణ మేలు చేస్తుంది.

**ధనుస్సు :** కాలం మిశ్రమంగా కొనసాగుతోంది. శ్రమతో కూడిన ఫలితాలు లభిస్తాయి. ఒక వ్యవహారంలో తోటివారి నుంచి సహాయం ఉంటుంది. కుటుంబ విషయాల్లో జాగ్రత్త అవసరం. అభిప్రాయ భేదాలు రాకుండా చూసుకోవాలి. దుర్గా స్తోత్ర పఠనం మేలు చేస్తుంది.

**మకరం :** వృత్తి, ఉద్యోగాల్లో శుభఫలితాలు ఉన్నాయి. సకారాత్మక ఆలోచనలు విజయాన్నిఇస్తాయి. ప్రారంభించిన పనిలో విజయం లభిస్తుంది. కుటుంబంలో శుభవార్త ఆనందాన్ని నింపుతుంది. ఒక ముఖ్య వ్యవహారంలో సహాయం లభిస్తుంది. శివారాధన శ్రేయస్కరం.

**కుంభం :** వృత్తి, ఉద్యోగ, వ్యాపారాల్లో ముందుచూపు అవసరం. మీ పనులకు దైవబలం తోడుంటుంది. ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. కీలక సందర్భాల్లో సలహాలు మేలు చేస్తాయి. నమ్మకంతో ముందుకు సాగాలి. శ్రీలక్ష్మీ ధ్యానం శుభప్రదం.

**మీనం :** ఆత్మవిశ్వాసం మిమ్మల్ని కాపాడుతుంది. ఉద్యోగంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. బంధువుల ప్రేమాభిమానాలు లభిస్తాయి. భోజన సౌఖ్యం కలుగుతుంది. మానసిక ఉల్లాసం పెరుగుతుంది. ఈశ్వరధ్యానం శుభకరం.



# ..మళ్లీ అధికారంలోకి బిఆర్ఎస్

పటాన్‌చెరు, జూలై 12, రుద్ర న్యూస్



పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియ వల్ల ఓటర్ల జాబితాల్లో మార్పులు జరిగి ఎన్నికల ఫలితాలు ప్రభావితమయ్యాయని ప్రచారం జరుగుతోందని పేర్కొంటూ, జిహెచ్ఎంసీ ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే ఆశావహులు, బిఎల్ఎ లు ఎస్ఐఆర్ ప్రక్రియను అత్యంత సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. పటాన్‌చెరు బిఆర్ఎస్ కు బలమైన కోట అని, గత మున్సిపల్ ఎన్నికల్లో ఐదుకు ఐదు చైర్మన్ స్థానాలను గెలుచుకున్నామని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్ల విలువైన భూములను విక్రయించిందని, బిఆర్ఎస్ హయాంలో అమలు చేసిన పథకాలను పక్కన పెట్టిందని ఆరోపించారు. కళ్యాణలక్ష్మి సహాయం ఆలస్యంగా అందుతోందని, మూసీ సుందరీకరణ, ఇతర పనులకు నిధులు వెచ్చిస్తూ పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. సిగాచి ప్రమాదంలో మృతుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ఇవ్వలేదని, కంపెనీ యాజమాన్యమే సాయం చేసిందని ఆరోపించారు. కేసీఆర్ హయాంలో నిర్మించిన ఆస్పత్రిని ఇప్పటికీ ప్రారంభించలేదని, పటాన్‌చెరులో ఐటీ పార్కు కోసం కేటాయించిన భూమిని విక్రయించారని, విద్యుత్ సరఫరా పరిస్థితి కూడా దిగజారిందని వ్యాఖ్యానించారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో అన్ని అసెంబ్లీ స్థానాల్లో బిఆర్ఎస్ విజయం సాధిస్తుందని, రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ 117 స్థానాలు గెలుస్తామనే వ్యాఖ్యలు చేస్తున్నప్పటికీ, ఆ పార్టీ తొమ్మిది స్థానాలకు మించి గెలవదని ఎద్దేవా చేశారు.

# రైతులకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్

(మొదటి పేజీ తరువాయి)



ప్రస్తావిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వాల పాలనలో అనేక మంది యువకులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం కోసం వేలాది మంది యువకులు, విద్యార్థులు, ఉద్యమకారులు తమ జీవితాలను త్యాగం చేశారని కేటీఆర్ అన్నారు. అలాంటి చరిత్ర ఉన్న కాంగ్రెస్ పార్టీ ఇప్పుడు మళ్లీ తెలంగాణ ప్రజల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను గౌరవించడం మానేసి రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. రైతులకు సాగునీరు అందించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైతులు నీటి కోసం నిరసనలు తెలపాల్సిన పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యమేనని పేర్కొన్నారు. నీటి సమస్యను పరిష్కరించకుండా రాజకీయ వ్యాఖ్యలతో కాలక్షేపం చేయడం సమంజసం కాదన్నారు. తెలంగాణ ఉద్యమంలో తాము ఎన్నో పోరాటాలు చేశామని, ప్రజల కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధమని కేటీఆర్ తెలిపారు. రైతుల ప్రయోజనాల కోసం తమ పార్టీ ఎప్పుడూ అండగా ఉంటుందని చెప్పారు. అవసరమైతే రైతుల తరఫున మరోసారి ఉద్యమానికి సిద్ధమని స్పష్టం చేశారు. ప్రభుత్వం ప్రజల సమస్యలను పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని, రైతులకు సాగునీరు అందించి వారి ఇబ్బందులను తొలగించాలని కేటీఆర్ కోరారు. రాజకీయ విమర్శలకు బదులుగా అభివృద్ధి, సంక్షేమం, సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై ప్రభుత్వం దృష్టి సారించాలని సూచించారు. తెలంగాణ ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే మాటలకన్నా చేతల్లో పాలన కనిపించాలని ఆయన వ్యాఖ్యానించారు.

# పవన్ కల్యాణ్‌ను పరామర్శించిన చంద్రబాబు

## ముంబై ఆసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి

## త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

ముంబై, జూలై 12 మహారాష్ట్రలోని ముంబైలో కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. శస్త్రచికిత్స అనంతరం వైద్యులు అందిస్తున్న చికిత్స, ఆరోగ్య పురోగతిపై వైద్య బృందాన్ని ముఖ్యమంత్రి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ ఆరోగ్యం త్వరగా మెరుగుపడాలని ఆకాంక్షిస్తూ వైద్యులు సూచించిన విశ్రాంతిని తప్పనిసరిగా పాటించాలని సూచించినట్లు సమాచారం.

ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు కొద్దిసేపు పవన్ కల్యాణ్‌తో మాట్లాడి ధైర్యం చెప్పారు. త్వరగా కోలుకుని మళ్లీ ప్రజాసేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కొనసాగుతోందని తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్‌కు ఇటీవల కుడి భుజానికి శస్త్రచికిత్స నిర్వహించగా, ప్రస్తుతం ఆయన వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిందని, ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి పరామర్శతో ఆసుపత్రి వద్ద కొంతసేపు సందడి నెలకొంది. తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ నాయకులు పవన్ కల్యాణ్ త్వరగా పూర్తిగా కోలుకోవాలని ఆకాంక్షించారు.





## అనంతగిరిలో ట్రెక్కింగ్‌కు వెళ్లి

# హైదరాబాద్ మహిళ మృతి

(మొదటి పేజీ తరువాయి)

చేరుకున్నారు. తొలు త నందిఘాట్ పరిసరాల్లో తిరిగారు. అనంతరం ట్రెక్కింగ్ చేస్తూ వ్యూపాయింట్ దగ్గరకి వెళ్లి అనంతగిరి అటవీ ప్రాంతాన్ని తిలకించారు. ఈ క్రమంలో ప్రియాంక మోల్ తీవ్ర అస్వస్థతకు గురై కుప్పకూలిపోయారు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను నాలుగు కి.మీ దూరంలో ఉన్న వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించా రు. పరీక్షించిన వైద్యులు.. ప్రియాంక గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిపారు. అప్పటి వరకు తమతో సరదాగా గడిపిన ప్రియాంక మోల్ విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతదేహాన్ని హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్థానిక పోలీసులు తెలిపారు.

# చార్మినార్ ఏసీపీ..

(మొదటి పేజీ తరువాయి)

వెంటనే స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు చంద్రహాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ తల్లి కడుపు, వెన్నెముక సంబంధమైన అనారోగ్య సమస్యలు తాళలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# కిషన్ రెడ్డి పాదయాత్ర

హైదరాబాద్, జూలై 12

అంబర్‌పేటలో నిర్వహించిన స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే పరిశుభ్రమైన నగరాన్ని నిర్మించ వచ్చని అన్నారు. పాదయాత్ర సందర్భంగా స్థానికులు చూపిన ఆదరణకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు తెలిపిన సూచనలు, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతి నిధులు, కాలనీ వాసులు, స్వచ్ఛంద కార్యకర్తలు పాల్గొన్నారు. స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రజలతో నిరంతరం అందుబాటులో ఉంటానని కిషన్ రెడ్డి తెలిపారు.


# వియత్నాం బాధితులకు అండగా ఏపీ ప్రభుత్వం

## మృతదేహాల తరలింపును వేగవంతం చేయాలని ఆదేశం

## బాధిత కుటుంబాలకు అన్ని విధాల సహాయం

## పరిస్థితిని సమీక్షించిన ముఖ్యమంత్రి

అమరావతి, జూలై 12





వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మృతి చెందిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురి మృతదేహాలను వీలైనంత త్వరగా వారి స్వస్థలాలకు తరలించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ప్రమాద బాధితులకు అందుతున్న సహాయ చర్యలపై ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించిన ఆయన, మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని స్పష్టం చేశారు. వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ ప్రమాదంలో ఓ ప్రముఖ మొబైల్ ఫోన్ సంస్థ ఏర్పాటు చేసిన విహారయాత్రలో పాల్గొన్న ప్రయాణికులు ప్రమాదానికి గురయ్యారు. పడవలో మొత్తం 32 మంది ప్రయాణిస్తుండగా, 15 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ముగ్గురు ఉన్నారు. అదే ప్రమాదంలో గాయపడిన గెల్లే కిశోర్ ప్రస్తుతం వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. మృతదేహాలను భారత్‌కు తరలించేందుకు వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం ప్రత్యేక ఏజెన్సీని నియమించినట్లు అధికారులు తెలిపారు. మృతదేహాల అప్పగింత, తరలింపు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని వెల్లడించారు. ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడిన వారిని ఆదివారం విమానాల ద్వారా స్వదేశానికి పంపేందుకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు, వారికి సంబంధిత మొబైల్ ఫోన్ సంస్థ విమాన టిక్కెట్లు సమకూర్చినట్లు వివరించారు. బాధితులు క్షేమంగా స్వదేశానికి చేరుకునే వరకు, మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగించే వరకు అవసరమైన అన్ని సహాయక చర్యలు అందించాలని న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్ అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. బాధిత కుటుంబాలతో నిరంతరం సంబంధాలు కొనసాగిస్తూ వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. ఈ ప్రమాదంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెంటనే స్పందించింది. ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. సమాచారం అందిన వెంటనే మంత్రి నారా లోకేశ్ వియత్నాంలోని భారత రాయబార కార్యాలయ అధికారులతో మాట్లాడి సహాయక చర్యలను వేగవంతం చేయాలని కోరారు. సహాయక చర్యల సమన్వయ బాధ్యతను రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీకి అప్పగించారు. ఆంధ్రప్రదేశ్ సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ఇరవై నాలుగు గంటలూ పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. వియత్నాంలోని భారత రాయబార కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ భవన్, ఏపీఎన్ఆర్టీ సొసైటీతో సమన్వయం చేస్తూ బాధితుల కుటుంబాలకు అవసరమైన సహాయాన్ని వేగంగా అందించేలా చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

# శ్వేత సంపాదకీయం

**సోమవారం 13-7-2026**

## జనాభా పెరిగితే తట్టుకోగలమా?

ఎన్నికల ముందు నేతలు ఇచ్చే హామీలన్నీ ఓట్ల కోసం అని ప్రజలు గుర్తించనంత వరకు ప్రజాస్వామ్యం అపహాస్యం అవుతూనే ఉంటుంది. అధికారంలోకి వచ్చాక సొంత ఎజెండాతో సాగుతారు. ఓట్ల కోసం తప్ప ప్రజలపై లేదా రాష్ట్రం, దేశంపై ప్రేమతో ఏ రాజకీయ నాయకుడు పనిచేయరని గుర్తించాలి. ఎపిలో చంద్రబాబు జనాభా విషయంలో చేస్తున్న విన్యాసం ఇదే. కేవలం మైనార్టీ ఓట్లను గంపగుత్తగా లాగేసేం దుకు అధికా జనాభా కావాలి, పిల్లను కనండి, డబ్బులు ఇస్తాను అంటున్నారు. ముగ్గురు అంతకన్నా ఎక్కువ ఉన్నవారికి తక్షణం 5వేల సాయం ప్రకటించారు. మరి లోకేశ్ ఒక్క పిల్లాడితోనే ఎందుకు సరిపుచ్చాడు. ఆయనకు ఈ నియమం వర్తించదా? చంద్రబాబు ఇంట్లోనే ఈ పద్దతి లేనప్పుడు రాష్ట్రానికి ఎందుకు అంటగట్టాలన్నది ప్రజలు ఆలోచన చేయాలి. ఇందులో ఏదో మతలబు లేకుండా చంద్రబాబు ప్రకటించరని గుర్తించాలి. ఇకపోతే ఎపిలో అనేక సమస్యలు ఉన్నాయి. ముఖ్యంగా శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయి. సాయికృష్ణ అనే వ్యక్తిని పోలీసులు తీసుకుని వెళ్లి మాయం చేస్తే అతీగతీ లేదు. ఓ చిన్నారి తప్పిపోతే దిక్కులేదు. రేప్‌లు జరుగుంతుంటే అడిగేవారు లేరు. కేవలం అమరావతి ఒక్కటే ఇప్పుడు లక్ష్యంగా బాబు పాలన సాగిస్తున్నాడు. ఇప్పటికే 33 వేల ఎకరాలు సేకరించినా ఇంకా భూమి కావాలంటూ రైతులను వేధిస్తున్నారు. భూములు ఇచ్చిన వారికి సక్రమంగా ప్లాట్లు ఇచ్చి వారిని సంతోషంగా ఉంచడం లేదు. కేవలం రియల్ వ్యాపారం లక్ష్యంగా బాబు పాలన సాగుతోందని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేస్తున్నారని జగన్ విమర్శలు చేస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మరచిన పాలకులు అధికారంలోకి రాగానే తమ సొంత ఎజెండా అమలు చేస్తుంటారు. ఇలా ఎన్నికల సమయంలో ప్రజల ముందు ఎన్నో హామీలు ఇస్తారు. ఉద్యోగాలు, అభివృద్ధి, సంక్షేమం, మౌలిక సదుపాయాలు, అవినీతి నిర్మూలన వంటి అంశాలపై గొప్ప గొప్ప ప్రకటనలు చేస్తారు. కానీ ఎన్నికలు ముగిసిన తర్వాత వాటిలో చాలా హామీలు మరుగున పడిపోతాయి. అవినీతి అన్నది కేవలం ఉద్యోగులకే పరిమితం అయ్యింది. వారు లంచం తీసుకుంటే పట్టేస్తున్నారు. అలా పట్టుకుంటున్న వారి సంఖ్య ఒక్కశాతం కూడా ఉండదేమో. లంచం లేనిదే పని జరగడం లేదు. లంచాల కోసమే ఉద్యోగాలు ఇచ్చారేమో అనుకోవాలి. ఇకపోతే ఇప్పటికే దేశం అధిక జనాభాతో సతమతం అవుతోంది. ఉన్న జనాభాకు సరిపడా తిండి పెట్టలేక పోతున్నాం. కనీస వసతులు కల్పించలేకపోతున్నాం. విద్య,వైద్యం అందించలేకపోతున్నాం. దేశం అభివృద్ధి చెందాలంటే కనీస వసతులు కలగాలి. పాలకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి. ప్రజలు కూడా తమ హక్కులతో పాటు బాధ్యతలను విస్మరించకూడదు. ఒకవైపు జవాబుదారీ పాలన, మరోవైపు బాధ్యతగల పౌరసమాజం ఉంటేనే నిజమైన ప్రగతి సాధ్యమవుతుంది. మనం ఇష్టం వచ్చినట్లు ప్రవర్తిస్తే, పాలిస్తే నష్టపోయేది రాష్ట్రమే. నష్టం జరిగేది ప్రజలకే తప్ప పాలకులకు కాదు. భారతదేశం ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఎదిగింది. 145 కోట్ల జనాభాతో సతమతమవుతోంది. యువశక్తి, సహజ వనరులు, మేథో సంపత్తి, సాంకేతిక నైపుణ్యం వంటి అనేక బలాలు మనకు ఉన్నా, అడుక్కు తిన్నట్లుగా ప్రజల జీవితాలు సాగుతున్నాయి. విద్య, ఆరోగ్యం, పారిశుద్ధం, పర్యావరణం వంటి విషయాల్లో వెనకబడి ఉన్నాం. అవినీతి ఊడలు దిగుతోంది. దీనికి కారణం కేవలం పాలకుల వైఫల్యమే కాదు, ప్రజల నిర్లక్ష్యం కూడా ఓ కారణంగా చూడాలి. మనకెందుకులే అనుకుంటే ఇలాగే సాగదీస్తారు. దేశాభివృద్ధి అంటే కేవలం ప్రభుత్వ పథకాలు, భారీ ప్రాజెక్టులు మాత్రమే కాదు. ప్రతి పౌరుడి బాధ్యతా యుతమైన పాత్ర పోషించాలి. ప్రజాస్వామ్య దేశంలో పౌరస్పృహ లేకపోతే పాలకులు మనలను

ఏమారుస్తారని గుర్తించాలి. ప్రజల సమస్యల కంటే రాజకీయ ప్రయోజనాలు, అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న తీరును చూస్తున్నాం. అన్ని రాష్ట్రాల్లోనూ ఇదే తరహా పాలన సాగుతోంది. ఆదాయాలను మించి ఖర్చు చేస్తున్నారు. రాజకీయ నేతల జీత భత్యాలు తడిసి మోపెడు అవుతున్నాయి. సంపాదనే ధ్యేయంగా కొందరి పాలకుల ప్రధాన లక్ష్యంగా మారుతోంది. ప్రజాస్వామ్యంలో అధికారాన్ని ప్రజలే ఇస్తారు. కాబట్టి ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం పాలకుల విధి. ప్రభుత్వాలు పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయరాదు. కానీ నిత్యం జరుగుతున్నది దుర్వినియోగం తప్ప మరోటి కాదు. ప్రజల సమస్యలను వినడం, తెలుసుకోవడం, అభివృద్ధి ఫలాలు అందరికీ చేరేలా చూడడం అన్నది జరగడం లేదు. పాలనలో జవాబుదారీతనం లేకుండా పోతోంది. ఎన్నికల రోజున బలవంతంగా ఓటు వేసి ఐదేళ్లు మౌనంగా ఉండటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం. ఇది మన కర్తవ్యాన్ని విస్మరించయడమే అవుతుంది. ప్రజా సమస్యలపై ప్రశ్నించడం, ప్రభుత్వ పనితీరును పరి శీలించడం, తప్పులను ఎత్తి చూపడం, మంచి కార్యక్రమాలను ప్రోత్సహించడం ప్రతి పౌరుడు బాధ్యతగా గుర్తించాలి. అధిక జనాభాతో సతమతం అవుతున్న మనం కనీస సౌకర్యలు లేనప్పుడు జనాభాను పెంచాలన్న పిలుపును వ్యతిరేకించాలి. ఉన్న పౌరులకు ఎలాంటి సౌకర్యాలు ఇస్తున్నారో అడగాలి. గర్భిణీలకు కనీస డెలివరీ సరిపడా ఆస్పత్రులు, వసతులు లేవన్న విషయం పాలకులకు గుర్తు చేయాలి. జనాభా పెరుగుదల అనర్థా హేతవు తప్ప అభివృద్ధి కాదని గుర్తిస్తే మంచిది.

# 60 ఏళ్లు పీడించింది చాలదా?

### తెలంగాణ బిడ్డల రక్తంతో తడిపించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీది

### రైతుల కోసం మా నెత్తురు ధారపోయడానికైనా సిద్ధం

### ఎండుతున్న పొలాలకు నీళ్లిచ్చి జలదాహం తీర్చండి

### సీఎం వ్యాఖ్యలకు కేటీఆర్ కౌంటర్



హైదరాబాద్, జూలై 12: పగుళ్లు బారిన పొలాలకు సాగునీరు అడిగితే రైతులపై నెత్తురు చల్లుతావా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎక్స్ వేదికగా ధ్వజమెత్తారు. ఇంకా తీరలేదా మీ రక్తదాహం? 60 ఏళ్లు పీడించి తెలంగాణ నెత్తురు తాగారు కదా అది సరిపోలేదా? తెలంగాణ రక్తం రుచిమరిగిన తోడేలు కాంగ్రెస్ పార్టీకి ఇంకెంత రక్తం కావాలి? అని ఆయన తీవ్ర పదజాలంతో మండిపడ్డారు. రైతుల కోసం తాము ఎంత రక్తమైనా ధారపోయడానికి సిద్ధంగా ఉన్నామని, ముందుగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**నెత్తుటేళ్లు పారించిన నరహంతకులు మీరు**

కాంగ్రెస్ పార్టీ చరిత్ర అంతా తెలంగాణ బిడ్డల రక్తంతో తడిచిందని కేటీఆర్ దుయ్యబట్టారు. తెలంగాణ పిల్లల్ని పిట్టల్ని కాల్చినట్టు కాల్చిపారేసి ఎన్‌కౌంటర్ల పేరుతో నెత్తుటేళ్లు పారించిన నరహంతకులు మీరు. 1952లో ఏడుగురు యువకులను కాల్చిచంపి రక్తం కళ్లజూసిన రాక్షసులు మీరని మండిపడ్డారు. 1969లో 369 మంది ముద్దుబిడ్డలపై తూటాలు కురిపించి రక్తం పారించిన ఖూనీకోర్లు మీరు. మలిదశ పోరాటంలో వెయ్యి మందిని బలితీసుకున్న మృగాలు మీరు. కాంగ్రెస్ రక్కసి కోరలకు తెలంగాణ నెత్తుటి మరకలు అంటాయి అని ఆయన నిప్పులు చెరిగారు.

**మీ రక్తదాహం తీర్చుకుని.. పొలాల జలదాహం తీర్చండి**

తెలంగాణ సాధన కోసం పేగులు తెగేదాకా కొట్లాడిన వాళ్లమని, నీళ్లలో నిప్పులు పుట్టించి జలసాధన పోరాటాలు చేశామని కేటీఆర్ గుర్తుచేశారు. నీకు మా రక్తం ఎంత కావాలంటే అంత పంపిస్తాం.. కానీ, నువ్వు రైతులకు నీళ్లు ఇవ్వు. నెత్తురు ఇస్తేనే నీళ్లు ఇస్తామని కర్కశ కాంగ్రెస్ ప్రభుత్వం కోరుతుంటే మా నెత్తురు ధారపోస్తాం. మా రక్తంతో మీ రక్తదాహం తీర్చుకుని, ఎండుతున్న పొలాల జలదాహం తీర్చండి అని కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు సవాల్ విసిరారు.



# నేటి నుంచి బీజేపీ సింగరేణి భరోసా యాత్ర

### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ కార్యక్రమం

### రెండు రోజుల పాటు బొగ్గు గనుల ప్రాంతాల్లో విస్తృత పర్యటన

### నాలుగు జిల్లాల్లో 3 సభలు, 5 చోట్ల కార్మికులతో ముఖాముఖి

### పాల్గొననున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీలు, ఎమ్మెల్యేలు

హైదరాబాద్, జూలై 12: సింగరేణి కార్మికులకు అండగా నిలుస్తూ వారికి పూర్తి భరోసా కల్పించే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ భారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో సోమ, మంగళ వారాల్లో సింగరేణి భరోసా యాత్రను చేపట్టనుంది. హైదరాబాద్‌లో ప్రారంభమయ్యే ఈ యాత్ర కొత్తగూడెం మీదుగా మంచిర్యాల వరకు సాగనుంది. యాత్రలో భాగంగా తొలి రోజైన సోమవారం కొత్తగూడెం, మణుగూరు, భూపాలపల్లి ప్రాంతాల్లో బీజేపీ నేతలు పర్యటించి సింగరేణి కార్మికులతో నేరుగా సమావేశం కానున్నారు.

**గనుల వద్దే ముఖాముఖి**

యాత్ర రెండో రోజైన 14వ తేదీన భూపాలపల్లి కేటీకే 8వ గని వద్ద కార్మికులతో నేతలు సమావేశమవుతారు. అక్కడి నుంచి తాడిచర్ల మైన్స్‌కు చేరుకుంటారు. అనంతరం గోదావరిఖని ఓపెన్ కాస్ట్ వద్ద కార్మికులతో భేటీ అవుతారు. ఆ తర్వాత శ్రీరాంపూర్ 3 మైన్స్‌ను సందర్శించి, వారితో ముఖాముఖి మాట్లాడతారు. అనంతరం మంచిర్యాలలో జరిగే సభతో ఈ రెండు రోజుల యాత్ర ముగుస్తుంది. మొత్తంగా నాలుగు జిల్లాల పరిధిలో మూడు భారీ సభలు, ఐదు చోట్ల కార్మికులతో సమావేశాలను నిర్వహించేలా రూట్ మ్యాప్ ఖరారు చేశారు.

**71 వేల మంది కార్మికులకు అండగా**

సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న 41 వేల మంది రెగ్యులర్ కార్మికులు, మరో 30 వేలకు పైగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు తెలుసుకుని వారికి పూర్తిస్థాయిలో భరోసా కల్పించడంలో భాగంగానే బీజేపీ ఈ ప్రతిష్ఠాత్మక యాత్రను చేపట్టింది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావుతో పాటు పార్టీకి చెందిన పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు భారీ సంఖ్యలో పాల్గొననున్నారు.



# అస్సాంలో భారీగా డ్రగ్స్ ధ్వంసం

### రూ.472.51 కోట్ల విలువైన డ్రగ్స్‌ను రోడ్డు రోలర్‌తో తొక్కించిన సీఎం హిమంత

గువాహటి, జులై 12: యువత జీవితాలను నిర్వీర్యం చేస్తున్న మాదకద్రవ్యాల నిర్మూలనపై అస్సాం ప్రభుత్వం ఉక్కుపాదం మోపింది. ఇటీవల వివిధ కేసుల్లో పోలీసులు స్వాధీనం చేసుకున్న సుమారు రూ.472.51 కోట్ల విలువైన భారీ మాదకద్రవ్యాల నిల్వలను ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ స్వయంగా రోడ్డు రోలర్ నడిపి తొక్కిస్తూ నాశనం చేశారు. దీనికి సంబంధించిన వీడియోను ఆయన ఎక్స్ వేదికగా పంచుకుంటూ.. రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనపై సాగిస్తున్న పోరాటాన్ని తదుపరి స్థాయికి తీసుకెళ్తున్నామని ప్రకటించారు. యువత భవిష్యత్తును బుగ్గిపాలు చేస్తున్న ఈ మహమ్మారికి వ్యతిరేకంగా తమ పోరాటం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆగదని, మాదక ద్రవ్యాలను రాష్ట్రం నుంచి పూర్తిగా తుడిచిపెట్టే వరకు విశ్రమించబోమని ముఖ్యమంత్రి ఈ సందర్భంగా గట్టిగా పునరుద్ఘాటించారు.

# కేసీఆర్ ఇల్లు హింసకు కేరాఫ్

### కాళేశ్వరం కూలిపోతే.. క్షమాపణలు చెప్పరా?

### మాజీ మంత్రులపై జగ్గారెడ్డి మండిపాటు

హైదరాబాద్, జూలై 12: లక్ష కోట్ల ప్రజా ధనాన్ని వృథా చేసి కాళేశ్వరం ప్రాజెక్టును నాశనం చేసినందుకు బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీశ్ రావు ముందుగా రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి డిమాండ్ చేశారు. రైతుల కోసం రక్తం చిందిస్తామంటూ హరీశ్ రావు చేస్తున్న వ్యాఖ్యలపై ఆయన తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఉద్యమం పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు ఎంతోమంది యువకులు బలిదానాలు చేస్తే, అప్పట్లో హరీశ్ రావు తనపై పెట్రోల్ పోసుకుని అగ్గిపెట్టె తెచ్చుకోవడం మర్చిపోయాడని, అలాంటి వ్యక్తి రక్తం చిందిస్తాడా అని ఎద్దేవా చేశారు. హింసకు కేరాఫ్ అడ్రస్ కేసీఆర్ ఇల్లేనని, ఆ కుటుంబానికి ఉన్న రెచ్చగొట్టే స్వభావం వల్లే నాడు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలను ప్రజల ముందుంచుతుంటే.. వాటి నుంచి దృష్టి మళ్లించడానికే హరీశ్ రావు రోజుకో కొత్త డైలాగ్‌తో మీడియా ముందుకొస్తున్నారని, తమకు నచ్చకపోతే సైకోలు అంటారా అని జగ్గారెడ్డి మండిపడ్డారు. రైతుల మేలు కోసం ఎంతదూరమైనా వెళ్లే కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటించేందుకు సిద్ధంగా ఉందని, కానీ ఆ సంస్థ వద్దకు వెళ్దామంటే హరీశ్ రావు నుంచి కనీస స్పందన లేదని జగ్గారెడ్డి విమర్శించారు. మరోవైపు బీజేపీ నేత ఈటల రాజేందర్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేసినందుకే ఇప్పుడు ఆ పార్టీ నేతలను కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈటలకు రైతులపై నిజంగా ప్రేమ ఉంటే కేసీఆర్, హరీశ్‌లను తీసుకుని కేంద్రం వద్దకు వెళ్లాలని, అవసరమైతే వారితో పాటు కాంగ్రెస్ మంత్రులు కూడా వస్తారని సవాల్ విసిరారు. ఇక, తుంగతుర్తి కాంగ్రెస్‌లో జరుగుతున్న పరిణామాలపై స్పందిస్తూ.. కోపతాపాలు, పంచాయితీలు కాంగ్రెస్‌లో సహజమేనని స్పష్టం చేశారు. ఇతర పార్టీల నేతల్లా లోపల దాచుకోకుండా తమ వాళ్లు ఓపెన్‌గా మాట్లాడుకుంటారని, తుంగతుర్తి పంచాయితీపై పోస్ట్‌మార్టం జరుగుతోందని, అందరి అభిప్రాయాలు తీసుకుని సమస్యను పరిష్కరించేలా రేపటికల్లా పార్టీకి రిపోర్ట్ ఇస్తామని ఆయన వెల్లడించారు.

# మైనింగ్ లీజుతో సింగరేణికి కొత్త ఊతం

**తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌కు విజయోత్సవాలు**

**ఇల్లందు ఏరియాలో ఘనంగా సంబరాలు**

**రెండు వేల మందికి ఉపాధి అవకాశాలు**



ఇల్లందు, జూలై 12

తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌కు కేంద్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ మంజూరు చేయడంతో సింగరేణి సంస్థ వ్యాప్తంగా నిర్వహిస్తున్న విజయోత్సవాలు ఆదివారం ఇల్లందు ఏరియాలో ఘనంగా జరిగాయి. కోయగూడెం బహిరంగ గని, జేకే--5 బహిరంగ గని, ఏరియా వర్క్‌షాప్, ఏరియా ఆసుపత్రి, భద్రతా విభాగం తదితర శాఖల్లో అధికారులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంబరాలు జరుపుకున్నారు. ఏరియా జనరల్ మేనేజర్ వి. కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్టులు, ప్రణాళిక) కె. వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులు, కార్మికులు ఒకరికి ఒకరు మిఠాయిలు పంచుకుని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాట్లాడిన డైరెక్టర్ కె. వెంకటేశ్వర్లు, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక కృషి ఫలితంగానే తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌కు మైనింగ్ లీజ్ మంజూరైందని తెలిపారు. ఈ లీజ్ సింగరేణి సంస్థ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. తాడిచర్ల--2 బొగ్గు బ్లాక్‌లో సుమారు 300 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయని, ఏటా 6 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేసే సామర్థ్యం ఈ గనికి ఉంటుందని వివరించారు. దాదాపు 45 సంవత్సరాల గని జీవితకాలం ఉండనున్న ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2,000 మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ఈ బొగ్గు బ్లాక్ అభివృద్ధితో సింగరేణి సంస్థతో పాటు తెలంగాణ పారిశ్రామిక రంగానికి మరింత బలం చేకూరుతుందని అధికారులు పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తి, పరిశ్రమల అవసరాలకు బొగ్గు సరఫరా పెరగడంతో రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి కూడా ఈ ప్రాజెక్టు దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.



# 'ప్రజా వినతి'లో అర్జీలు స్వీకరించిన అచ్చెన్నాయుడు

**నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో కార్యక్రమం**

**ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యల ఆదేశం**

**అధికారులతో నేరుగా మాట్లాడిన మంత్రి**

నిమ్మాడ, జూలై 12

ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. ఆదివారం నిమ్మాడలోని తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజా వినతి' కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి నేరుగా అర్జీలను స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు వ్యక్తిగత, సామాజిక, సంక్షేమ, రెవెన్యూ, మౌలిక సదుపాయాలు, ఇతర పరిపాలనా అంశాలకు సంబంధించిన వినతులను మంత్రికి అందజేశారు. ప్రతి అర్జీని మంత్రి స్వయంగా పరిశీలించి సమస్యల స్వరూపాన్ని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. కొన్నింటిపై అక్కడికక్కడే అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు వేగంగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని అచ్చెన్నాయుడు సూచించారు. సమస్యల పరిష్కారంలో జాప్యానికి తావివ్వకుండా ప్రతి వినతిపై నిర్ణీత గడువులో చర్యలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తోందని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# అపరకర్మల సత్రం నూతన కమిటీ ప్రమాణం

**మచిలీపట్నంలో ఘనంగా కార్యక్రమం**

**పేదలకు మరింత ఉపయోగపడేలా సేవలు అందించాలని ఆకాంక్ష**

**పూర్వ వైభవం తీసుకురావాలని పిలుపు**

**రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర**



మచిలీపట్నం, జూలై 12

మచిలీపట్నంలోని దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న తమ్మన పిచ్చయ్య అపరకర్మల సత్రం నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో కొందరి స్వార్థ ప్రయోజనాల కోసం అపరకర్మల సత్రాన్ని అన్యాక్రాంతం చేసేందుకు ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. ప్రస్తుతం దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో పారదర్శకంగా నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి ప్రమాణ స్వీకారం నిర్వహించడం శుభపరిణామమని పేర్కొన్నారు. తమ్మన పిచ్చయ్య అపరకర్మల సత్రం హిందూ ధర్మాన్ని అనుసరించే పేద, మధ్యతరగతి కుటుంబాలకు మరింత ఉపయోగపడే విధంగా సేవలను విస్తరించాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ సత్రం సేవా కార్యక్రమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. నూతన పాలకవర్గ సభ్యులు అంకిత భావంతో పనిచేసి సత్రానికి పూర్వ వైభవాన్ని తీసుకురావాలని మంత్రి కోరారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ పారదర్శకంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమం అనంతరం నూతన కార్యవర్గ సభ్యులను మంత్రి అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, సత్రం పాలకవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# వియత్నాం బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కొల్లు రవీంద్ర



విజయవాడ, జూలై 12

వియత్నాంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో మృతి చెందిన మచిలీపట్నానికి చెందిన గెల్లి జయశ్రీ కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం విజయవాడలో పరామర్శించారు. మొగల్రాజపురంలోని వారి నివాసానికి వెళ్లిన మంత్రి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా గెల్లి జయశ్రీ పిల్లలతో మంత్రి మాట్లాడి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, అధైర్యపడవద్దని కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. వారికి అవసరమైన సహాయ సహకారాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వియత్నాంలో చికిత్స పొందుతున్న గెల్లి కిశోర్ పరిస్థితిపై కూడా మంత్రి ఆరా తీశారు. కిశోర్‌కు సహాయంగా అక్కడ ఉన్న కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడి ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న వైద్య సేవల గురించి వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు అందిస్తున్న చికిత్సపై ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను ఆదేశించారు.



# పద్మభూషణ్‌ను తిరస్కరించిన స్వరకోకిల జానకి

హైదరాబాద్, జులై 12

భారత సినీ సంగీత ప్రపంచాన్ని తన మధుర గానంతో దశాబ్దాల పాటు అలరించిన ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకి మరణంతో దేశవ్యాప్తంగా విషాద ఛాయలు అలుముకున్నాయి. దాదాపు ఆరు దశాబ్దాల పాటు వేలాది పాటలతో కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఆమె, వయోభారంతో పాటు అనారోగ్య సమస్యల కారణంగా చికిత్స పొందుతూ 88 ఏళ్ల వయసులో కన్నుమూశారు. ఆమె మరణవార్త తెలిసిన వెంటనే సినీ, రాజకీయ, సాహిత్య, సంగీత రంగాలకు చెందిన ప్రముఖులు నివాళులు అర్పిస్తూ ఆమె సేవలను కొనియాడుతున్నారు. ఈ నేపథ్యంలో జానకి జీవితంలోని ఎన్నో విశేషాలు మరోసారి చర్చనీయాంశంగా మారాయి.

అందులో ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మభూషణ్ పురస్కారాన్ని ఆమె గౌరవపూర్వకంగా తిరస్కరించిన సంఘటన మరోసారి అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. 2013లో కేంద్ర ప్రభుత్వం దేశ అత్యున్నత పౌర పురస్కారాల్లో ఒకటైన పద్మభూషణ్‌కు జానకిని ఎంపిక చేసింది. అయితే ఈ గౌరవాన్ని స్వీకరించబోనని ఆమె ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశారు. ఆ సమయంలో కేరళలో జరిగిన ఒక వివాహ కార్యక్రమానికి హాజరైన జానకి మీడియాతో మాట్లాడుతూ, గత 55 ఏళ్లుగా వివిధ భారతీయ భాషల్లో పాటలు పాడానని, దేశంలోని అన్ని ప్రాంతాల ప్రజలు తనను ఆదరించి అపారమైన ప్రేమను అందించారని తెలిపారు. అభిమానులు తనపై చూపించిన ప్రేమాభిమానాలే తనకు అతిపెద్ద పురస్కారమని, దానికంటే గొప్ప గౌరవం మరొకటి లేదని ఆమె స్పష్టం చేశారు. అలాగే ప్రభుత్వం పట్ల తనకు ఎలాంటి అసంతృప్తి లేదని, ప్రభుత్వం తప్పు చేసిందని తాను భావించడం లేదని కూడా జానకి వెల్లడించారు. తన జీవితకాలంలో ప్రజల ప్రేమను పొందడం, తన పాటలు తరతరాలుగా వినిపించడం కంటే గొప్ప గుర్తింపు మరొకటి లేదని పేర్కొన్నారు. అనంతరం ఇచ్చిన మరో ఇంటర్వ్యూలో దక్షిణ భారత కళాకారులకు తగిన సమయంలో గుర్తింపు లభించడం లేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. సంగీత రంగానికి ఎన్నో దశాబ్దాలుగా సేవలందించినప్పటికీ ఈ గౌరవం చాలా ఆలస్యంగా వచ్చిందని భావించినందువల్లే పద్మభూషణ్‌ను స్వీకరించలేదని వివరించారు. ఆ సమయంలో జానకి భారతరత్నకు అర్హురాలనే చర్చలు కూడా విస్తృతంగా సాగాయి. ఆమె భారతరత్న గురించి వ్యాఖ్యానించారంటూ పలు కథనాలు వెలువడినప్పటికీ, ఆ అంశంపై ఆమె అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. జానకి కుమారుడు మురళీకృష్ణ కూడా అప్పట్లో స్పందిస్తూ, ఈ గౌరవం తమ తల్లికి చాలా సంవత్సరాల ముందే రావాల్సిందని అభిప్రాయపడ్డారు. పురస్కారానికి ఎంపిక చేసిన విషయాన్ని ముందుగా కుటుంబానికి తెలియజేయలేదని, అధికారిక ప్రకటన వచ్చిన తర్వాతే తమకు సమాచారం తెలిసిందని చెప్పారు. ఎంతో ఆలస్యంగా వచ్చిన గుర్తింపును గౌరవపూర్వకంగా తిరస్కరించాలని ఆమె స్వయంగా నిర్ణయించుకున్నారని వెల్లడించారు. భారతీయ సంగీత చరిత్రలో వేలాది చిరస్మరణీయ గీతాలను అందించిన ఎస్. జానకి తన మధుర గానంతో ఎన్నో తరాలను అలరించారు.




# డ్రగ్స్‌కు నో.. జీవితానికి యస్

పెనుగొండ, జూలై 12

శ్రీ సత్యసాయి జిల్లా పెనుగొండ నియోజకవర్గంలోని సోమందేపల్లి మండల కేంద్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు ఆదివారం భారీ ర్యాలీ, రెండు కిలోమీటర్ల పరుగు కార్యక్రమం నిర్వహించారు. "డ్రగ్స్‌కు నో.. జీవితానికి యస్" అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ తన భర్తతో కలిసి పాల్గొన్నారు. సోమందేపల్లి పట్టణంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పిస్తూ రెండు కిలోమీటర్ల మేర పరుగు నిర్వహించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నినాదాలు చేస్తూ యువతను చైతన్యపరిచారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ రాష్ట్రానికి, సమాజానికి యువతే వెన్నెముక అని అన్నారు. అలాంటి యువత గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు బానిసై తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సూచించారు. విద్య, కష్టపడి పనిచేయడం, క్రమశిక్షణతోనే జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. మత్తు పదార్థాల వ్యసనం యువత జీవితాలను మాత్రమే కాకుండా కుటుంబాల ఆశలను కూడా చీకటిలోకి నెడుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రతి యువకుడు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి సమాజానికి ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ రహిత, సురక్షిత పెనుగొండ నిర్మాణమే లక్ష్యంగా ఇటువంటి అవగాహన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఉషశ్రీ చరణ్ తెలిపారు.




# ఆటోనగర్‌లో భారీ అగ్నిప్రమాదం

**ఏడు ప్రైవేట్ బస్సులు దగ్ధం**

**మూడు అగ్నిమాపక వాహనాలతో మంటల అదుపు**

**కారణాలపై దర్యాప్తు ప్రారంభం**

విజయవాడ, జూలై 12

విజయవాడ నగరంలోని ఆటోనగర్‌లో ఆదివారం మధ్యాహ్నం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఏడు బస్సులు పూర్తిగా దగ్ధమయ్యాయి. భారీ ఎత్తున మంటలు ఎగిసిపడటంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఆటోనగర్‌లోని ఓ మెకానిక్ షెడ్‌లో మరమ్మతుల కోసం నిలిపి ఉంచిన ఒక బస్సులో తొలుత మంటలు చెలరేగాయి. కొద్దిసేపటికే ఆ మంటలు వేగంగా వ్యాపించి పక్కనే నిలిపి ఉంచిన మరో ఆరు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను కూడా చుట్టుముట్టాయి. దీంతో కొద్ది నిమిషాల్లోనే మొత్తం ఏడు బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. మంటలను గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది మూడు అగ్నిమాపక వాహనాలతో ఘటనాస్థలికి చేరుకుని గంటల పాటు శ్రమించి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు.

సమీప ప్రాంతాలకు మంటలు వ్యాపించ కుండా సకాలంలో చర్యలు చేపట్టడంతో మరింత పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించకపోవడంతో అధికారులు, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే ఏడు బస్సులు పూర్తిగా కాలిపోవడంతో ట్రావెల్స్ సంస్థకు భారీ ఆస్తి నష్టం వాటిల్లినట్లు అధికారులు తెలిపారు. నష్టం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా లేదా మరేదైనా సాంకేతిక లోపం వల్ల ప్రమాదం జరిగిందా అనే కోణంలో విచారణ కొనసాగిస్తున్నారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు సాంకేతిక నివేదిక వచ్చిన తర్వాతే వెల్లడవుతాయని అధికారులు తెలిపారు.

# 50 ఏళ్ల తర్వాత కలిసిన చిన్ననాటి నేస్తాలు

- జ్ఞాపకాలతో భావోద్వేగ సమ్మేళనం
- 1975-76 జాజ బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ వేడుక
- సహచరులతో బాల్య జ్ఞాపకాల్లో ఎమ్మెల్యే చింత ప్రభాకర్
- రాజకీయ ప్రయాణం, వ్యక్తిగత అనుభవాలు పంచుకున్న ఎమ్మెల్యే
- అవినీతికి దూరంగా పనిచేశానని వ్యాఖ్య
- గురువులకు ఘన సత్కారం, మిత్రులకు ఆత్మీయ సన్మానం
- మధుర జ్ఞాపకాలతో ముగిసిన ఆత్మీయ కలయిక



**సంగారెడ్డి ప్రతినిధి, జూలై 12,**

సదాశివపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1975-76 జాజ బ్యాచ్ గోల్డెన్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళనం మల్కాపూర్ శివారులో భావోద్వేగ వాతావరణంలో జరిగింది. అర్ధ శతాబ్దం తర్వాత ఒకేచోట చేరిన చిన్ననాటి సహచరులు ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ పాఠశాల రోజుల మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో పాల్గొన్న సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ సహచరులు, గురువులతో కలిసి బాల్య స్మృతుల్లో మునిగిపోయారు. 50 ఏళ్ల తర్వాత తన పదో తరగతి స్నేహితులను కలుసుకోవడం మాటల్లో చెప్పలేని ఆనందమని పేర్కొం టూ, జీవితంలో ఎన్నో కష్టాలు, అవమా నాలు ఎదురైనా ప్రజల ప్రేమ, అండదండలతో ముందుకు సాగి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని తెలిపారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత అక్రమాలు, అవినీతికి దూరంగా ఉంటూ, తన వల్ల ఎవరికీ నష్టం, ఇబ్బంది కలగకూడదనే ఆలోచనతో ప్రజాసేవ చేశానని చెప్పారు. 2009లో తొలి ఎన్నికల పోరులో ఎదురైన సవాళ్లను గుర్తు చేసుకుంటూ ప్రజల విశ్వాసమే తన విజయానికి కారణమని పేర్కొన్నారు. తన రాజకీయ, ప్రజా జీవితంలో భార్య సహకారం కీలకమైందని, కుటుంబ బాధ్యతలను ఆమె నిర్వహించడంతో ప్రజల్లో ఉండగలిగానని వెల్లడించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించి ఆశీస్సులు తీసుకోగా, బ్యాచ్‌మేట్లను ఒకే వేదికపైకి తీసుకురావడంలో కృషి చేసిన చింత ప్రభాకర్‌కు సహచరులు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిన్ననాటి మిత్రులను శాలువాలతో సన్మానించి, వారితో కలిసి ఫొటోలు దిగుతూ ఆత్మీయంగా గడిపారు. అర్ధ శతాబ్దం తర్వాత జరిగిన ఈ కలయిక పూర్వ విద్యార్థుల హృదయాల్లో చిరస్మరణీయ జ్ఞాపకంగా నిలిచింది.



## జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ప్రమాణం

**ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న మంత్రి కొండా సురేఖ**

**విజ్ఞాన సమాజ నిర్మాణానికి గ్రంథాలయాలే పునాది**

**విద్యా వికాసంలో కీలక పాత్ర పోషించాలని ఆకాంక్ష**

**వరంగల్, జూలై 12**

వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ నూతన చైర్మన్‌గా మీసాల ప్రకాశ్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రమాణ స్వీకార మహోత్సవంలో రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ముఖ్య అతిథిగా పాల్గొని నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరూ విద్యావంతులుగా, విజ్ఞానవంతులుగా ఎదగడంలో గ్రంథాలయాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. చదువుతో పాటు ఆలోచనా శక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాల సేవలు ఎంతో విలువైనవని పేర్కొన్నారు. గ్రంథాలయాలు కేవలం పుస్తకాలు చదివే కేంద్రాలు మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని పంచే వేదికలుగా అభివృద్ధి చెందాలని మంత్రి సూచించారు. యువత, విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకుని తమ భవిష్యత్తును మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని పిలుపునిచ్చారు. నూతన చైర్మన్ మీసాల ప్రకాశ్ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ జిల్లా గ్రంథాలయ సంస్థ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి ఆకాంక్షించారు. ప్రజలకు మరింత మెరుగైన గ్రంథాలయ సేవలు అందించేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రంథాలయ సంస్థ సభ్యులు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయానికి భూమిపూజ

**జగిత్యాల, జూలై 12**

జగిత్యాల జిల్లా కేంద్రంలోని చలగల్ వాలంతరీ వ్యవసాయ క్షేత్రంలో కేంద్రీయ విద్యాలయ శాశ్వత భవన నిర్మాణానికి ఆదివారం భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, కరీంనగర్ లోక్‌సభ సభ్యుడు ధర్మపురి అరవింద్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, మేడిపల్లి సత్యం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో కేంద్రీయ విద్యాలయ నిర్మాణం కోసం ఐదు ఎకరాల భూమిని కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, విద్యార్థులకు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించేందుకు అన్ని విధాలా సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

# గిన్నిస్ రికార్డు విజేతలకు సన్మానం

**హనుమకొండ విద్యార్థులకు మంత్రి అభినందనలు**

**ప్రపంచ వేదికపై తెలంగాణ ప్రతిభ**

**భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**



**హైదరాబాద్, జూలై 12**

గచ్చిబౌలి స్టేడియంలో ఇటీవల నిర్వహించిన కరాటే ప్రదర్శనలో గిన్నిస్ ప్రపంచ రికార్డు సాధించి తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపు తీసుకొచ్చిన హనుమకొండ జిల్లా భీమారం ప్రాంతానికి చెందిన ఐదుగురు విద్యార్థులను రాష్ట్ర మంత్రి కొండా సురేఖ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థులను అభినందిస్తూ, చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారని పేర్కొన్నారు. క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర సాధనతో సాధించిన ఈ విజయం మరెందరో విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తుందని అన్నారు. ప్రపంచ స్థాయిలో గిన్నిస్ రికార్డు సాధించడం ద్వారా తెలంగాణ యువతలో అపార ప్రతిభ ఉందని మరోసారి నిరూపితమైందని మంత్రి తెలిపారు. ఇలాంటి విజయాలు రాష్ట్ర క్రీడారంగానికి మరింత ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణతో పాటు దేశానికి పేరు తీసుకురావాలని మంత్రి ఆకాంక్షించారు. వారి తల్లిదండ్రులు, శిక్షకులు అందించిన ప్రోత్సాహం, శ్రమ అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా గిన్నిస్ రికార్డు సాధించిన విద్యార్థులను మంత్రి ప్రత్యేకంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే యువతకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని పేర్కొన్నారు.

# రూ.76 కోట్లతో రైల్వే వంతెనకు శంకుస్థాపన


**నకిరేకల్‌లో అభివృద్ధి పనులకు శ్రీకారం**

**ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయన్న మంత్రి**

**సేతు బంధన్ పథకానికి కేంద్రానికి కృతజ్ఞతలు**

**నల్గొండ, జూలై 12**

నల్గొండ జిల్లా నకిరేకల్ నియోజకవర్గంలోని నార్కట్‌పల్లి--మునుగోడు రహదారిపై రూ.76 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రైల్వే పైవంతెనకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ వంతెన నిర్మాణంతో ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సేతు బంధన్ (సీఆర్ఐఎఫ్) పథకం కింద తెలంగాణకు తొలిసారిగా రూ.103 కోట్ల నిధులు మంజూరు చేయడం సంతోషకరమని అన్నారు. ఇందులో నకిరేకల్ రైల్వే పైవంతెన నిర్మాణానికి రూ.76 కోట్ల నిధులు కేటాయించడం అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేసిన కేంద్ర రహదారుల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు వేగంగా అమలవుతున్నాయని చెప్పారు. రైల్వే గేటు వద్ద తరచూ ఏర్పడే ట్రాఫిక్ సమస్యలకు ఈ వంతెనతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని మంత్రి తెలిపారు. రహదారి భద్రత మెరుగుపడటంతో పాటు ప్రయాణ సమయం కూడా గణనీయంగా తగ్గుతుందని చెప్పారు. వంతెన నిర్మాణం పూర్తయిన తర్వాత నకిరేకల్, నార్కట్‌పల్లి, మునుగోడు ప్రాంతాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# రూ.358 కోట్లతో రహదారుల అభివృద్ధికి శ్రీకారం

**11 రహదారుల పనులకు శంకుస్థాపన**

**గ్రామీణ ప్రాంతాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు**

**అభివృద్ధికి నాణ్యమైన రహదారులే పునాది**

**యాదాద్రి భువనగిరి, జూలై 12**

యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేటలో హ్యామ్ తొలి దశ, రెండో ప్యాకేజీ కింద రూ.358.18 కోట్ల వ్యయంతో 210.10 కిలోమీటర్ల మేర 11 రహదారుల అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్టులతో నకిరేకల్ నియోజకవర్గంతో పాటు పరిసర ప్రాంతాల అభివృద్ధికి ఊతం లభిస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రహదారుల అభివృద్ధి పూర్తయిన అనంతరం గ్రామీణ ప్రాంతాల కు మెరు గైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నా రు. గ్రామాల మధ్య అనుసంధానం మరింత బలోపే తం కావడంతో ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పా రు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సుల భంగా తరలించడంతో పాటు విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపా రులకు ప్రయాణ సౌకర్యాలు మెరుగుపడతాయని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టులు స్థానిక ఆర్థికాభివృద్ధికి కొత్త ఊపు తీసుకువస్తాయని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రపంచ స్థాయి రహదారి మౌలిక వసతుల కల్పనే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్య మని కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రతి నియోజకవర్గంలో నాణ్యమైన రహదారులను నిర్మిస్తూ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు. నిర్ణీత గడువులో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు.





# ఆరేళ్ల చిన్నారితో కారు నడిపించిన ఎస్ఐ?

**రంగారెడ్డి జిల్లాలో ఘటన కలకలం**

**ప్రశ్నించిన వారిపై దురుసుగా స్పందించారనే ఆరోపణ**

**వీడియో వైరల్.. దర్యాప్తు కోరుతున్న స్థానికులు**

**హైదరాబాద్, జూలై 12**

రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ పోలీసు అధికారి వ్యవహారంగా ప్రచారం జరుగుతున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెయిన్ రోడ్డుపై తన ఆరేళ్ల మనవరాలికి కారు డ్రైవింగ్ నేర్పిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనపై స్థానికులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తుండగా, వీడియో సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా చర్చనీయాంశమైంది. ప్రచారంలో ఉన్న వివరాల ప్రకారం, ఓ ఎస్ఐ తన మనవరాలిని డ్రైవింగ్ సీటులో కూర్చోబెట్టి ప్రధాన రహదారిపై కారు నడిపించినట్లు చెబుతున్నారు. ఈ విషయం గమనించిన స్థానికులు చిన్నారితో రోడ్డుపై వాహనం నడపించడం ప్రమాదకరమని అభ్యంతరం వ్యక్తం చేశారు. అయితే దీనిపై ప్రశ్నించిన వారితో ఎస్ఐ దురుసుగా వ్యవహరించారని, “నా ఇష్టం... నన్ను అడగడానికి మీరెవరు?” అని సమాధానం ఇచ్చినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో పలువురు నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. చిన్నారులకు వాహనాలు నడిపేందుకు అనుమతించడం మోటారు వాహనాల చట్టానికి విరుద్ధమని, ప్రజలకు చట్టాలను అమలు చేయాల్సిన బాధ్యత ఉన్న అధికారులే నిబంధనలు ఉల్లంఘిస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై పోలీసు శాఖ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి, ఘటన జరిగిన పరిస్థితులు, ఆరోపణల వాస్తవాలపై అధికారిక నిర్ధారణ రావాల్సి ఉంది. దర్యాప్తు అనంతరం మాత్రమే పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



# జూబ్లీహిల్స్‌లో ఫెరారీ బీభత్సం

**అపార్ట్‌మెంట్ గేటును ఢీకొట్టిన లగ్జరీ కారు**

**కోట్ల విలువైన వాహనం ధ్వంసం.. పరారైన ప్రయాణికులు**

**మద్యం మత్తులోనే ప్రమాదమా? పోలీసుల దర్యాప్తు**

**హైదరాబాద్, జూలై 12**

హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో ఆదివారం తెల్లవారుజామున కోట్ల రూపాయల విలువైన ఫెరారీ కారు బీభత్సం సృష్టించింది. అతివేగంగా దూసుకొచ్చిన కారు అదుపుతప్పి ఫోర్ట్ వ్యూ అపార్ట్‌మెంట్స్ ప్రధాన గేటును బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు సంభవించకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఫిలింనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జూబ్లీహిల్స్ రోడ్ నంబర్--5లో ఈ ఘటన జరిగింది. సుమారు రూ.3.50 కోట్లకు పైగా విలువ చేసే ఫెరారీ రోమా కారు అపార్ట్‌మెంట్ గేటును ఢీకొనడంతో గేటు పూర్తిగా ధ్వంసమైంది. అదే సమయంలో కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఉన్న డ్రైవర్‌తో పాటు ఇతరులు అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ధ్వంసమైన కారును టోయింగ్ వాహనం సాయంతో పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అతివేగంతో పాటు మద్యం మత్తులో నిర్లక్ష్యంగా వాహనం నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. కారులో ఎంతమంది ఉన్నారు, ప్రమాదం సమయంలో వాహనాన్ని ఎవరు నడిపారు అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. సమీప ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ఇటీవలి రోజుల్లో జూబ్లీహిల్స్‌లో వరుసగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ఆందోళన కలిగిస్తున్నాయి. జూలై 9న రాత్రి రోడ్ నంబర్--10లో ప్రముఖ సినీ నటుడు ధర్మ నివాసం కాంపౌండ్ గోడను ఓ ఎస్‌యూవీ ఢీకొట్టిన ఘటన మరువకముందే మరో ప్రమాదం చోటుచేసుకుంది. ఆ ఘటనలో మద్యం మత్తులో వాహనం నడిపిన కార్తీక్ కుమార్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



## కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న

# మహేశ్ కుమార్ గౌడ్

**ఎల్‌బీ స్టేడియంలో ప్రత్యేక పూజలు**

**రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థనలు**

**విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షుడు**

హైదరాబాద్, జూలై 12

హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియం ప్రాంగణంలో నిర్వహిస్తున్న శ్రీ కనకదుర్గ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్ కుమార్ గౌడ్ ఆదివారం పాల్గొన్నారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలని ప్రార్థించారు. రాష్ట్రంలో శాంతి, సౌభాగ్యం నెలకొని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యత, సామరస్య భావాలను పెంపొందిస్తాయని ఆయన పేర్కొన్నారు. భక్తి, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి హాజరైన భక్తులతో మహేశ్ కుమార్ గౌడ్ ముచ్చటించి వారి క్షేమాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆలయ నిర్వాహకులు నిర్వహిస్తున్న కార్యక్రమాలను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన ప్రత్యేక పూజలు భక్తిశ్రద్ధలతో కొనసాగాయి.



# నాగార్జున యాదవ్ అరెస్ట్

**రేవంత్‌పై వ్యాఖ్యల కేసులో చర్య**

**గుంటూరులో అదుపులోకి తీసుకున్న తెలంగాణ పోలీసులు**

**దర్యాప్తు కోసం హైదరాబాద్‌కు తరలింపు**

గుంటూరు, జూలై 12

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి యనమల నాగార్జున యాదవ్‌ను తెలంగాణ పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. గుంటూరు జిల్లాలోని ఆయన నివాసానికి చేరుకున్న పోలీసులు చట్టపరమైన ప్రక్రియలను పూర్తి చేసి అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలించినట్లు సమాచారం. పోలీసుల వివరాల ప్రకారం, ఇటీవల ఓ టెలివిజన్ చర్చా కార్యక్రమంలో నాగార్జున యాదవ్ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై ఫిర్యాదు నమోదైంది. ముఖ్యమంత్రిని ఉద్దేశించి అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదు చేసి తెలంగాణ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా తెలంగాణ పోలీసుల బృందం ఆదివారం గుంటూరుకు చేరుకుని నాగార్జున యాదవ్ నివాసంలో ఆయనను అదుపులోకి తీసుకుంది. అరెస్టు విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేసిన అనంతరం స్థానిక నల్లపాడు పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చి, తదుపరి విచారణ కోసం హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. ఒక రాష్ట్రానికి చెందిన రాజకీయ పార్టీ నేతను మరో రాష్ట్ర పోలీసులు వచ్చి అరెస్టు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఈ పరిణామంపై అధికార, ప్రతిపక్ష పార్టీల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేసుకు సంబంధించిన తదుపరి విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, నాగార్జున యాదవ్ చేసిన వ్యాఖ్యల వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో వివాదం నెలకొంది. ఆ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేయగా, ఆ ఫిర్యాదు ఆధారంగా తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు సమాచారం.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌ను పరిశీలించిన కలెక్టర్

**కుంటాల, ముధోల్ మండలాల్లో ఆకస్మిక తనిఖీలు**

**గడువులోగా ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం**

**పారదర్శకంగా నమోదు చేపట్టాలని సూచన**



నిర్మల్, జూలై 12

జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదివారం కుంటాల, ముధోల్ మండలాల్లో ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించి ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణ తీరును తనిఖీ చేశారు. కుంటాల మండలంలోని కల్లూరు, ముధోల్ మండలంలోని తరోడ గ్రామపంచాయతీ కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్, డిజిటలైజేషన్ ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తూ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియను నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఆన్‌లైన్ నమోదు, రికార్డుల నిర్వహణలో ఖచ్చితత్వం పాటిస్తూ ప్రతి దశను జాగ్రత్తగా అమలు చేయాలని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు కావడంతో పాటు ఎలాంటి ఫిర్యాదులకు తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు అవసరమైన సహాయం అందిస్తూ ప్రక్రియను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల సందర్భంగా తహసీల్దార్లు కమల్ సింగ్, శ్రీలత, తరోడ సర్పంచ్ అరిఫుద్దీన్‌తో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. డిజిటలైజేషన్ పనుల పురోగతిని అధికారులు కలెక్టర్‌కు వివరించారు.

# పేరూరులో మహాభారత మహోత్సవం ముగింపు

**31 ఏళ్ల సంప్రదాయానికి కొనసాగింపు**

**దుర్యోధన వధ ఘట్టం వీక్షించిన ఎమ్మెల్యే**

**దేవాలయ అభివృద్ధికి సహకారం అందిస్తానన్న హామీ**



తిరుపతి, జూలై 12

తిరుపతి రూరల్ మండలంలోని పేరూరు శ్రీ కృష్ణ దేవరాజులు దేవాలయంలో నిర్వహించిన మహాభారత మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. గ్రామస్తుల ఆహ్వానం మేరకు తిరుపతి ఎమ్మెల్యే పులివర్తి నాని ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా పేరూరు గ్రామంలో ప్రతి ఏడాది మహాభారత ప్రవచనాలను నిర్వహించడం గర్వకారణమని అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయడంలో ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. మహాభారత మహోత్సవాల చివరి రోజున నిర్వహించే దుర్యోధన వధ ఘట్టాన్ని ఎమ్మెల్యే స్థానిక నాయకులు, గ్రామస్తులు, భక్తులతో కలిసి వీక్షించారు. అనంతరం గత 25 సంవత్సరాలుగా మహోత్సవాల ముగింపు సందర్భంగా పొట్టిరెడ్డి, ముకుందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. రామాయణం, మహాభారతం వంటి ఇతిహాసాలు మనిషి జీవన విధానాన్ని, ధర్మాన్ని, సమాజంలో ఎలా నడుచుకోవాలో తెలియజేసే గొప్ప గ్రంథాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. యువత ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల ద్వారా భారతీయ విలువలను తెలుసుకోవాలని సూచించారు. అనంతరం దేవాలయ అభివృద్ధికి అవసరమైన పనుల వివరాలను గ్రామ పెద్దలు తెలియజేయాలని, తన పరిధిలో సాధ్యమైనంత సహకారం అందిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ‘లెనిన్’ దర్శకుడికి ఎమ్మెల్యే సన్మానం

**మురళి కిషోర్‌కు అభినందనలు**

**సినిమా విజయంపై హర్షం వ్యక్తం**

**మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్ష**



చంద్రగిరి, జూలై 12

హీరో అఖిల్ నటించిన ‘లెనిన్’ సినిమా దర్శకుడు మురళి కిషోర్ అబ్బురును చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆదివారం సన్మానించారు. ఇటీవల విడుదలైన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతున్న సందర్భంగా దర్శకుడికి శాలువా కప్పి ఘనంగా అభినందనలు తెలిపారు. తిరుపతి జిల్లా రామచంద్రపురం మండలం కమ్మకండ్రిగ గ్రామానికి చెందిన మురళి కిషోర్ అబ్బురు దర్శకత్వంలో తెరకెక్కిన ‘లెనిన్’ చిత్రం ప్రేక్షకుల ఆదరణ పొందుతున్న నేపథ్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. స్వగ్రామానికి చెందిన దర్శకుడు సినీ రంగంలో గుర్తింపు పొందడం ఆనందకర విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ సందర్భంగా పులివర్తి నాని మాట్లాడుతూ ప్రతిభ, పట్టుదలతో మురళి కిషోర్ సినీ రంగంలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని విజయవంతమైన చిత్రాలను రూపొందించి తెలుగు చిత్రసీమకు మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. సన్మానానికి స్పందించిన దర్శకుడు మురళి కిషోర్ అబ్బురు తనను ప్రోత్సహించిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రేక్షకుల ఆదరణే తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తోందని, మంచి కథలతో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం కొనసాగిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు



# జానకికి చంద్రబాబు నివాళి


**ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో శ్రద్ధాంజలి**

**భారతీయ సంగీతానికి ఆమె సేవలు చిరస్మరణీయం**

**కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి**

అమరావతి, జూలై 12

ప్రముఖ నేపథ్య గాయని, గానకోకిల ఎస్. జానకి మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆదివారం ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎస్. జానకి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ భారతీయ సంగీత ప్రపంచానికి ఎస్. జానకి అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. తెలుగు నేలపై జన్మించిన ఆమె తన మధుర గానంతో ఆరు దశాబ్దాలకు పైగా కోట్లాది మంది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నారని పేర్కొన్నారు. ఆమె ఆలపించిన వేలాది పాటలు తరతరాలకు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. భాషలకు అతీతంగా తన గాన ప్రతిభతో దేశవ్యాప్తంగా విశేష గుర్తింపు పొందిన ఎస్. జానకి సంగీత ప్రపంచంలో చెరగని ముద్ర వేశారని చంద్రబాబు తెలిపారు. ఆమె మరణంతో భారతీయ సంగీత రంగం ఓ గొప్ప గాన మాణిక్యాన్ని కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్. జానకి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారికి ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆమె అభిమానులందరికీ తన సానుభూతిని తెలియజేశారు. ఎస్. జానకి శనివారం సాయంత్రం మైసూరులోని అపోలో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. గుండెపోటుకు గురికావడంతో ఆసుపత్రికి తరలించి వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఆమెను కాపాడలేకపోయారు. ఆమె మృతి సంగీతాభిమానులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది.



## హైదరాబాద్‌కు బయల్దేరిన

# తెలుగు పర్యాటకులు

**వియత్నాం ప్రమాదం నుంచి బయటపడిన వారికి ఊరట**

**మృతదేహాల తరలింపునకు ఏర్పాట్లు**

**సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్న ఏపీ ప్రభుత్వం**

అమరావతి, జూలై 12

వియత్నాంలో శనివారం జరిగిన ఘోర పడవ ప్రమాదం నుంచి ప్రాణాలతో బయటపడిన తెలుగు పర్యాటకులంతా సురక్షితంగా హనోయిలోని నోయ్ బాయ్ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్నారు. వారు ఆదివారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం 7:05 గంటలకు వియత్నాం ఎయిర్‌లైన్స్ విమానంలో హైదరాబాద్‌కు బయల్దేరినట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వెల్లడించింది. భారత కాలమానం ప్రకారం రాత్రి 10 గంటల ప్రాంతంలో వారు హైదరాబాద్‌కు చేరుకోనున్నట్లు తెలిపింది. వియత్నాంలోని ఫు క్వోక్ ద్వీపం సమీపంలో జరిగిన ఈ పడవ ప్రమాదంలో మొత్తం 15 మంది భారతీయులు ప్రాణాలు కోల్పోగా, వారిలో ముగ్గురు ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు ఉన్నారు. ఓ ప్రముఖ మొబైల్ ఫోన్ సంస్థ తమ పంపిణీదారుల కుటుంబాల కోసం ఏర్పాటు చేసిన విహారయాత్ర సందర్భంగా ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన సమయంలో పడవలో మొత్తం 32 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గెల్లి కిశోర్ ప్రస్తుతం వియత్నాంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి క్రమంగా మెరుగుపడుతోందని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. బాధితుడికి అవసరమైన వైద్య సేవలు అందేలా భారత రాయబార కార్యాలయం నిరంతరం పర్యవేక్షిస్తోంది. ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదివారం అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రమాదం నుంచి బయటపడిన వారిని సురక్షితంగా స్వదేశానికి చేర్చాలని, మృతుల కుటుంబాలకు సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు.

# వనస్థలిపురంలో దారుణ హత్య

- రోడ్డు పక్కన రక్తపు మడుగులో మృతదేహం
- అనేక కత్తిపోట్లతో వ్యక్తి హత్య
- నిందితుల కోసం గాలిస్తున్న పోలీసులు

హైదరాబాద్, జూలై 12

హైదరాబాద్‌లోని వనస్థలిపురం ప్రాంతంలో ఆదివారం ఉదయం దారుణ హత్య కలకలం రేపింది. పనామా కూడలి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తిని దుండగులు అత్యంత కిరాతకంగా హత్య చేసి రోడ్డు పక్కన పడవేసి పరారయ్యారు. రక్తపు మడుగులో మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వనస్థలిపురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి శరీరంపై అనేక కత్తిపోట్లు ఉన్నట్లు గుర్తించారు. హత్య అత్యంత దారుణంగా జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. మృతుడు ఎవరనే విషయంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. అతని గుర్తింపునకు సంబంధించిన ఆధారాలను సేకరిస్తూ కుటుంబ సభ్యుల వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలు ఇంకా తెలియరాలేదని పోలీసులు తెలిపారు. వ్యక్తిగత కక్షలు, పాత విభేదాలు లేదా ఇతర కారణాల వల్ల ఈ ఘటన జరిగి ఉండొచ్చనే కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సంఘటనా స్థలం పరిసరాల్లోని సీసీటీవీ దృశ్యాలను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.





# లార్డ్స్ టెస్టులో గెలుపు దిశగా భారత్

## సెంచరీతో యాస్తికా భాటియా సరికొత్త రికార్డు..

### 457 పరుగుల లక్ష్య ఛేదనలో ఇంగ్లాండ్ స్కోర్ 107/5

లార్డ్స్, జులై 12: ఇంగ్లాండ్‌తో లార్డ్స్ మైదానంలో జరుగుతున్న ఏకైక టెస్ట్ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు చారిత్రాత్మక విజయం దిశగా దూసుకుపోతోంది. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 285 పరుగులు, ఇంగ్లాండ్ 170 పరుగులకు ఆలౌట్ కాగా, అనంతరం తన రెండో ఇన్నింగ్స్‌ను భారత్ 341/7 స్కోరు వద్ద డిక్లేర్ చేసి ఇంగ్లాండ్ ముందు 457 పరుగుల భారీ లక్ష్యాన్ని ఉంచింది. భారత మిడిలార్డర్ బ్యాటర్ యస్తికా భాటియా (145 బంతుల్లో 113 పరుగులు) తన కెరీర్‌లో తొలి టెస్టు శతకంతో అదరగొట్టడమే కాకుండా, లార్డ్స్ వేదికగా సెంచరీ సాధించిన మొట్టమొదటి మహిళా క్రికెటర్‌గా చారిత్రక రికార్డు సృష్టించింది; ఆమెతో పాటు స్మృతి మంధాన (70), రిచా ఘోష్ (52 నాటౌట్), షెఫాలీ వర్మ (33), దీప్తి శర్మ (10) రాణించగా, ఇంగ్లాండ్ బౌలర్లలో సోఫీ ఎకిల్‌స్టోన్ 5 వికెట్లు, లారెన్ బెల్ రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం హిమాలయ సదృశ్యమైన లక్ష్య ఛేదనతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు, భారత బౌలింగ్ దాడికి కడపటి వార్తలందేసరికి కేవలం 115 పరుగులకే 5 వికెట్లు కోల్పోయి తీవ్ర పరాజయ ముంగిట నిలిచింది.



# ఫిఫా వరల్డ్‌కప్ సెమీస్‌కు అర్జెంటీనా, ఇంగ్లాండ్

## స్విస్‌ను 3-1తో చిత్తు చేసిన మెస్సి సేన

## నార్వేకు షాకిచ్చిన ఇంగ్లాండ్



స్పోర్ట్స్ డెస్క్, జులై 12: ఫిఫా ప్రపంచకప్‌లో లియోనెల్ మెస్సి సారథ్యంలోని అర్జెంటీనా, స్టార్ ప్లేయర్ జుడె బెల్లింగ్‌హామ్ సత్తా చాటిన ఇంగ్లాండ్ జట్లు సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లడంతో బుధవారం అర్ధరాత్రి ఇరు జట్ల మధ్య జరగబోయే హై-వోల్టేజ్ పోరుకు తెరలేచింది. హోరాహోరీగా సాగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో స్విట్జర్లాండ్‌పై అర్జెంటీనా 3-1 తేడాతో ఘన విజయం సాధించింది. ఆట మొదలైన 10వ నిమిషంలోనే అలెక్సిస్ అలిస్టర్ గోల్‌తో అర్జెంటీనా బోణీ కొట్టగా, 67వ నిమిషంలో స్విస్ ప్లేయర్ డాన్ ఎండోయె గోల్‌తో స్కోర్లు సమమయ్యాయి. అయితే 72వ నిమిషంలో స్విట్జర్లాండ్ ఆటగాడు బ్రీల్ ఎంబోలో రెడ్ కార్డ్‌తో వెనుదిరగడంతో ఆ జట్టు 10 మందితోనే అదనపు సమయంలోనూ గట్టి పోటీనిచ్చింది. చివరకు షూటౌట్ వైపు వెళ్తున్న మ్యాచ్‌ను మలుపు తిప్పుతూ జులియన్ అల్వరెజ్ (112వ నిమిషం), లౌటరో మార్టినెజ్ (120o1వ నిమిషం) అద్భుత గోల్స్ చేసి కెప్టెన్ మెస్సి గోల్ కొట్టకపోయినా అర్జెంటీనాను గెలిపించారు. మరో క్వార్టర్స్ పోరులో, ఇర్లింగ్ హాలాండ్‌పై భారీ ఆశలు పెట్టుకున్న నార్వే జట్టుకు ఇంగ్లాండ్ గట్టి షాకిచ్చింది. మ్యాచ్ 36వ నిమిషంలో నార్వే ఆటగాడు ఆడ్రీస్ తొలి గోల్ కొట్టి ఆధిక్యం అందించినప్పటికీ, ఇంగ్లాండ్ స్టార్ జుడె బెల్లింగ్‌హామ్ ప్రథమార్ధ ముగింపు సమయం (45o2 నిమిషం)లో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఆపై ఆట అదనపు సమయానికి చేరగా, 93వ నిమిషంలో బెల్లింగ్‌హామ్ మరో క్లాస్ గోల్‌తో బౌన్స్ బ్యాక్ అయి ఇంగ్లాండ్‌కు 2-1 తేడాతో ఉత్కంఠభరిత విజయాన్ని అందించాడు.

# పశ్చిమాసియాలో ముదిరిన యుద్ధం


## ఇరాన్‌లో 140 లక్ష్యాలపై అమెరికా బాంబింగ్

## ప్రతిగా యూఎస్ స్థావరాలపై క్షిపణుల వర్షం!

## హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి

## ఒక భారతీయుడు గల్లంతు

## ఖతార్, ఒమన్‌లపై క్షిపణి దాడులతో తీవ్ర ఉద్రిక్తత



దుబాయ్/న్యూఢిల్లీ, జులై 12: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మరోసారి తారస్థాయికి చేరి తీవ్ర యుద్ధ వాతావరణాన్ని తలపిస్తున్నాయి. వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేయడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన అమెరికా.. ఇరాన్‌లోని దాదాపు 140 సైనిక లక్ష్యాలపై ఏకకాలంలో విరుచుకుపడి భారీ దాడులు నిర్వహించింది. దీనికి ప్రతిగా గల్ఫ్ దేశాల్లోని వివిధ అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణులు, బాంబుల వర్షం కురిపించింది. గత జూన్ నెలలో పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ అధ్యక్షుడు పెజెష్కియాన్ మధ్య కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందం ఈ తాజా పరస్పర దాడులతో పూర్తిగా ముగిసిపోయింది. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారం తీర్చుకుంటామని ఆయన కుమారుడు (ప్రస్తుత సుప్రీం లీడర్) ప్రకటించడం, హర్మూజ్ జలసంధిని మూసివేస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడంతో పరిస్థితులు మళ్లీ మొదటికొచ్చాయి. ఈ నేపథ్యంలో ఇరుదేశాల మధ్య శాంతిని పునరుద్ధరించేందుకు పాక్ మళ్లీ రంగంలోకి దిగింది. పాకిస్థాన్ డిప్యూటీ ప్రధాని, విదేశాంగ మంత్రి మహ్మద్ ఇషాక్ దార్.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో అత్యవసరంగా మాట్లాడి, జూన్ ఒప్పందం ప్రకారం సంయమనం పాటించి ఉద్రిక్తతలు తగ్గించాలని కోరారు.ఇదిలా ఉండగా, ఒమన్ తీరం వద్ద హర్మూజ్ జలసంధిలో ప్రయాణిస్తున్న సైప్రస్ జెండాతో కూడిన 'జీఎఫ్ఎస్ గెలాక్సీ' అనే వాణిజ్య నౌకపై ఇరాన్ చేసిన క్షిపణి దాడి అంతర్జాతీయంగా తీవ్ర కలకలం రేపింది. ఈ దాడి కారణంగా నౌక ఇంజిన్ రూమ్ తీవ్రంగా దెబ్బతినడమే కాకుండా భారీగా మంటలు వ్యాపించడంతో, ప్రాణభయంతో సిబ్బంది నౌకను వదిలేసి చిన్న లైఫ్‌బోట్ ద్వారా బయటపడ్డారు. ఈ నౌకలో మొత్తం 11మంది భారతీయ సిబ్బంది ఉండగా.. వారిలో 10 మందిని సురక్షితంగా రక్షించగా, ఒక భారతీయుడు సముద్రంలో గల్లంతయ్యాడు. ఈ బాధ్యతారాహిత్య దాడిని భారత విదేశాంగ శాఖ తీవ్రంగా ఖండించింది. ఒమన్‌లోని భారత దౌత్య కార్యాలయం అక్కడి ప్రభుత్వ అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ గల్లంతైన భారతీయుడి కోసం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టిందని, తమకు సహకరిస్తున్న ఒమన్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతున్నామని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది.

మరోవైపు, హర్మూజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడం మరియు నిరంతర దాడుల నేపథ్యంలో గల్ఫ్ దేశమైన ఖతార్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రజా భద్రత దృష్ట్యా తదుపరి ఉత్తర్వులు వచ్చేంత వరకు వాణిజ్య, విహార నౌకలతో పాటు చేపల బోట్ల సముద్ర కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేయాలని నౌకల యాజమాన్యాలను ఆదేశించింది. కాగా, ఖతార్ రాజధాని దోహా లక్ష్యంగా ఇరాన్ ఈ ఉదయం బాలిస్టిక్ క్షిపణులను ప్రయోగించగా.. వాటిలో కొన్నింటిని ఖతార్ రక్షణ వ్యవస్థ విజయవంతంగా కూల్చివేసింది, అయితే ఈ దాడుల్లో కొందరు పౌరులకు తీవ్ర గాయాలైనట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఇటు పొరుగు దేశమైన ఒమన్ సైతం ఇరాన్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అమెరికా స్థావరాలపై దాడుల పేరిట తమ భూభాగంపై బాంబులు ప్రయోగించడాన్ని తప్పుబడుతూ, పొరుగు దేశాల సార్వభౌమాధికారాన్ని గౌరవించాలంటూ ఒమన్‌లోని ఇరాన్ రాయబారికి సోషల్ మీడియా వేదికగా తీవ్ర నిరసన తెలిపింది. హర్మూజ్ జలసంధి సమస్యపై చర్చల కోసం ఇరాన్ విదేశాంగ మంత్రికి ఒమన్ ఆతిథ్యం ఇచ్చిన మరుసటి రోజే ఈ దాడి జరగడం గమనార్హం.





# టీమిండియాలో మార్పులు

## గాయాలతో హర్షిత్ రాణా, వరుణ్ చక్రవర్తి దూరం!

## రిప్లేస్‌మెంట్‌గా జట్టులోకి ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్

లండన్,జులై 12: ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్, జింబాబ్వేతో టీ20 సిరీస్‌లు ఆడనున్న భారత క్రికెట్ జట్టులో బీసీసీఐ రెండు కీలక మార్పులు చేసింది. ఇంగ్లాండ్‌తో జరిగిన టీ20 సిరీస్ మధ్యలో గాయాల బారిన పడి వైదొలిగిన పేసర్ హర్షిత్ రాణా, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి స్థానాల్లో ప్రిన్స్ యాదవ్, రవి బిష్ణోయ్‌లను భర్తీ చేసినట్లు బోర్డు అధికారికంగా ప్రకటించింది. మూడో టీ20 మ్యాచ్ సందర్భంగా కుడి తొడ కండరానికి గ్రేడ్-1 గాయం కావడంతో హర్షిత్ వన్డే సిరీస్‌కు దూరం కాగా, అతడి స్థానంలో ప్రిన్స్ యాదవ్ వన్డే జట్టులోకి వచ్చాడు. అలాగే ఎడమ తొడ కండరానికి గ్రేడ్-2 గాయం కారణంగా జింబాబ్వేతో టీ20 సిరీస్‌కు వరుణ్ చక్రవర్తి దూరం కావడంతో రవి బిష్ణోయ్‌కు చోటు దక్కింది. ప్రస్తుతం ఈ ఇద్దరు రిప్లేస్‌మెంట్ ప్లేయర్లు ఇంగ్లాండ్‌లోనే ఉన్న టీ20 జట్టుతో కొనసాగుతుండగా, గాయపడిన ఆటగాళ్లు పునరావాసం కోసం 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'కు రిపోర్ట్ చేయనున్నారు. కాగా, మంగళవారం నుంచి ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియా వన్డే సిరీస్‌ను ప్రారంభించనుంది.




# రెండ్రోజుల్లో 37.2 కోట్లు

అక్కినేని అఖిల్ లీడ్ రోల్ లో నటించిన లేటెస్ట్ మూవీ లెనిన్ బాక్సాఫీస్ వద్ద సాలిడ్ గా దూసుకుపోతోంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఆ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్ విడుదలైన తొలి రోజు నుంచే ప్రేక్షకుల నుంచి పాజిటివ్ రెస్పాన్స్ అందుకుంది. అదే జోష్ రెండో రోజు కూడా కొనసాగడంతో సినిమా వసూళ్లు మరింత పెరిగాయి. రెండు రోజుల కలెక్షన్లను మూవీ నిర్మాణ సంస్థలు అధికారికంగా అనౌన్స్ చేశాయి. మేకర్స్ వెల్లడించిన వివరాల ప్రకారం, లెనిన్ మూవీ రెండు రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా రూ. 37.2 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు సాధించింది. ప్రేక్షకుల నుంచి వస్తున్న పాజిటివ్ టాక్, మౌత్ పబ్లిసిటీ సినిమాకు పెద్ద బలంగా మారిందని మేకర్స్ తెలిపారు. విడుదలైన కొద్ది రోజుల్లోనే ఈ రేంజ్ వసూళ్లు రావడం మూవీ టీమ్ లో ఉత్సాహాన్ని నింపిందనే చెప్పాలి. శుక్రవారం విడుదలైన ఆ సినిమా తొలి రోజే మంచి ఓపెనింగ్స్ నమోదు చేసింది. ఆ తర్వాత శనివారం వీకెండ్ కావడంతో ఫ్యామిలీ ఆడియన్స్ తో యూత్ కూడా థియేటర్లకు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ముఖ్యంగా ఈవెనింగ్, నైట్ షోలకు సూపర్ రెస్పాన్స్ కనిపించడంతో ఆక్యుపెన్సీ శాతం కూడా పెరిగినట్లు ట్రేడ్ పండితులు చెబుతున్నారు. అందుకే ఫస్ట్ డే కన్నా రెండు రోజు పెరిగాయని అంటున్నారు. అఖిల్ కెరీర్ లో లెనిన్ సినిమాకు స్పెషల్ ఇంపార్టెన్స్ ఉంది. గత చిత్రాల రిజల్ట్స్ తర్వాత సరైన విజయాన్ని అందుకోవాలన్న టార్గెట్ తో ఆయన ఆ ప్రాజెక్ట్ ను చిన్న గ్యాప్ తర్వాత సెలెక్ట్ చేసుకున్నారు. విలేజ్ బ్యాక్ డ్రాప్ తో రూపొందిన కథ, మాస్ ఎలిమెంట్స్, ఎమోషన్స్ మిక్స్ చేసిన స్క్రీన్ ప్లే ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయని సినీ ఎక్స్పర్ట్స్ అభిప్రాయపడుతున్నారు. సినిమాలో అఖిల్ యాక్టింగ్ కు మంచి ప్రశంసలు వస్తున్నాయి. యాక్షన్ తో పాటు ఎమోషనల్ సీన్స్ లో కూడా ఆయన తన పాత్రను సరైన విధంగా డీల్ చేశారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. హీరోనే భాగ్యశ్రీ బోర్సే తన పాత్రకు న్యాయం చేయగా, ఇతర క్యాస్టింగ్ కూడా కథకు బలం చేకూర్చారని ప్రేక్షకులు చెబుతున్నారు. సినిమాలోని ఇంటర్వెల్ ఎపిసోడ్, క్లైమాక్స్ తో పాటు జూనియర్ ఎన్టీఆర్ అందించిన వాయిస్ ఓవర్ కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటోందని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. ఆ అంశాలు సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయని చెప్పాలి. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు కథను కమర్షియల్ అంశాలతో మిక్స్ చేసి తెరకెక్కించిన తీరు సినిమాకు ప్లస్ గా మారిందని సినీ ఎక్స్పర్ట్స్ చెబుతున్నారు. మాస్ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన యాక్షన్ సన్నివేశాలు, కథలోని ట్విస్టులు ప్రేక్షకులను థియేటర్లలో అలరిస్తున్నాయని అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




## ‘శ్రీనివాస మంగాపురం’ ట్రైలర్ రిలీజ్

ఘట్టమనేని ఫ్యామిలీ నుంచి మరో వారసుడు టాలీవుడ్ ఎంట్రీకి గ్రాండ్‌గా రెడీ అయిపోయాడు. సూపర్ స్టార్ కృష్ణ మనవడు, మహేష్ బాబు అన్న రమేష్ బాబు కుమారుడు జయ కృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయం అవుతున్న లేటెస్ట్ మూవీ ‘శ్రీనివాస మంగాపురం’. వైవిధ్యమైన సినిమాలతో గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్ అజయ్ భూపతి తెరకెక్కించిన ఈ క్రేజీ ప్రాజెక్ట్ థియేట్రికల్ ట్రైలర్‌ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేసింది. పక్కా లవ్, యాక్షన్, ఎమోషనల్ ప్యాకేజీలా ఉన్న ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విపరీతమైన వ్యూస్‌తో దూసుకుపోతూ సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. అదిరిపోయిన జయ కృష్ణ స్క్రీన్ ప్రెజెన్స్: తొలి సినిమాతోనే జై కృష్ణ ఘట్టమనేని తన లుక్స్, యాక్టింగ్‌తో అందరినీ షాక్ గురిచేశాడు. ఘట్టమనేని వారసుడిగా మంచి కటౌట్‌తో స్క్రీన్ మీద చాలా కాన్ఫిడెంట్‌గా కనిపించాడు. ముఖ్యంగా లవ్ సీన్స్‌లో క్యూట్‌గా నటిస్తూనే.. యాక్షన్ సీక్వెన్స్‌లలో పవర్‌ఫుల్ పర్ఫార్మెన్స్‌తో అదరగొట్టాడు. ఇక డెబ్యూ హీరోలా కాకుండా ఎంతో అనుభవం ఉన్న నటుడిలా బాడీ లాంగ్వేజ్ మెయింటైన్ చేయడం చూసి టాలీవుడ్ వర్గాలు ప్రశంసలు కురిపిస్తున్నాయి.



## తిట్టిపోస్తున్నారు!

ఒక సినిమాకు ముందో హీరోయిన్ని అనుకుని తర్వాత ఇంకో కథానాయికను తీసుకోవడం ఫిలిం ఇండస్ట్రీలో కొత్తేమీ కాదు. ఆ పాత్ర క్లిక్ అయితే, ఆ సినిమా బాగా ఆడితే ముందు అవకాశాన్ని వదులుకున్న హీరోయిన్ అన్ లక్కీ అనుకుంటారు. అంతకుమించి పెద్దగా డిస్కషన్ ఉండదు. కానీ ఇలా ఛాన్స్ మిస్సయిన హీరోయిన్ని అదే పనిగా టార్గెట్ చేస్తూ నెగెటివ్ కామెంట్లు చేస్తుండడమే విడ్డూరం. ‘లెనిన్’ సినిమాకు ముందు కథానాయికగా ఎంపికై, తర్వాత ఏవో కారణాలతో తప్పుకున్న శ్రీలీల గురించి ఇలాంటి డిస్కషనే నడుస్తోంది సోషల్ మీడియాలో. శ్రీలీల స్థానంలోకి వచ్చిన భాగ్యశ్రీ బోర్సే ఈ అవకాశాన్ని గొప్పగా ఉపయోగించుకుంది. ప్రోమోల్లోనే అందరి దృష్టినీ ఆకర్షించిన భాగ్యశ్రీ.. సినిమాలోనూ ఆకట్టుకుంది. పాటల్లో అందచందలు, డ్యాన్సులతో అదరగొట్టిన భాగ్యశ్రీ.. నటనలోనూ మెప్పించింది. ఓవరాల్‌గా తన పెర్ఫామెన్స్‌కు మంచి స్పందన వస్తోంది. ఇప్పటిదాకా ఒక్క హిట్టూ కొట్టని భాగ్యశ్రీకి ‘లెనిన్’ ఒక మోస్తరు విజయాన్నందించేలా కనిపిస్తోంది. ఐతే ‘లెనిన్’ చూసిన వాళ్లు భాగ్యశ్రీని కొనియాడడం వరకు పరిమితం అయితే పర్వాలేదు. కానీ ఇదే సమయంలో శ్రీలీలను టార్గెట్ చేస్తున్నారు. ఆమె భారతి పాత్రను చేసి ఉంటే అది పాడైపోయేదని.. భాగ్యశ్రీలా ఆ పాత్రను పండించేది కాదని.. కీలక సన్నివేశాల్లో తేలిపోయేదని కామెంట్లు చేస్తున్నారు. శ్రీలీలను తప్పించి మంచి పని చేశారంటూ కౌంటర్లు వేస్తున్నారు. ఐతే శ్రీలీల ఎంత కమిటెడ్ యాక్ట్రెస్, ఎంత ప్రొఫెషనల్‌గా, ఉంటుంది, ఎంత అణకువతో వ్యవహరిస్తుంది అన్నది అందరికీ తెలుసు. ఎప్పుడూ యాటిట్యూడ్ చూపించింది .

# ఐటం సాంగ్ సినిమా డీఎన్ఏలో భాగం: మమతా శర్మ

–ఐటమ్ సాంగ్స్–కున్న ప్రాముఖ్యత గురించి చెప్పాల్సిన పనిలేదు. ఇప్పుడంటే కంటెంట్ మోజులో పడి ఐటం పాటల్ని లైట్ తీసుకుంటున్నారు గానీ నాలుగైదేళ్ల క్రితం వరకూ ఐటం పాటలకు ఎలాంటి డిమాండ్ కనిపించిందో చెప్పాల్సిన పనిలేదు. అయితే వీటిపై అదే స్థాయిలో భిన్నమైన అభిప్రాయాలు కూడా లేకపోలేదు. ప్రత్యేకంగా బాలీవుడ్ పరిశ్రమలో ఇలాంటి అభిప్రాయాలు వ్యక్తమవుతుంటాయి. తాజాగా ఈ అంశంపై ప్రముఖ గాయని మమతా శర్మ తన అభిప్రాయాన్ని పంచుకున్నారు. ఐటం పాటలు మన సినిమా డీఎన్ఏలో అంతర్భాగంగా పేర్కొన్నారు. కాలంతో పాటు సంగీతం, నృత్యం మారుతున్నప్పటికీ కమర్షియల్ సినిమాల్లో ఎనర్జిటిక్ పాట ఉండాలనే కాన్సెప్ట్ మాత్రం అలాగే ఉందన్నారు. ఈ తరహా పాటలు ప్రేక్షకులకు వినోదాన్ని పంచడమే కాకుండా సినిమాకు ప్రత్యేకమైన హైప్‌ను క్రియేట్ చేయడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. చాలా మంది ఐటం పాటలను గ్లామర్ అంశంగా చూస్తారని కానీ ఒక పాట హిట్ అవ్వాలంటే దాని వెనుక ఎంతో కష్టం ఉంటుందన్నారు. ట్యూన్, సాహిత్యం, గాత్రం అన్నీ కలిస్తేనే ఆ పాట తెరపై మ్యాజిక్‌ను సృష్టిస్తుందన్నారు. కేవలం గ్లామర్ మాత్రమే సినిమాను నిలబెట్టలేదన్నారు. ఐటమ్ సాంగ్స్ పట్ల ఉండే నెగటివిటీని పక్కనపెడితే అవి అందించే వినోద విలువను ఎవరూ కాదనలేరని ఉద్ఘాటించారు. ఒక ఐటమ్ సాంగ్ సినిమా ఫ్లోను ఎలా మారుస్తుందో? గమనించాలని మమతా శర్మ సూచించారు. కథలో కీలక మలుపు దగ్గర ... ప్రేక్షకులు థియేటర్లో బోర్ ఫీలవుతున్న సమయంలో ఇలాంటి ఎనర్జిటిక్ పాటలు కొత్త ఉత్సాహాన్ని నింపుతాయని అభిప్రాయపడ్డారు. మ్యూజికల్ ఫీస్ట్ లాంటి ఈ పాటలు బాక్సాఫీస్ వద్ద సినిమా కలెక్షన్లను ప్రభావితం చేయడంలోనూ ..యూత్‌ను థియేటర్లకు ఆకర్షించడంలోనూ తమవంతు పాత్రను పోషిస్తాయని తెలిపారు.



“This newspaper/periodical is published by KALIDINDI SUMALATHA from 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA - 500020. on behalf of **RS USAR PUBLICATIONS**, edited by RAGHURAMA RAJU KALIDINDI and printed by **KALIDINDI SUMALATHA** at **KING DIGITAL OFFSET PRINTERS**, 1-7-750/1-3, F 103, SRUTHI SADAN APTS ST PIOUS SCHOOL ROAD, RAMNAGAR, HYDERABAD, TELANGANA – 500020. **PRGI NO: TGTEL/26/A2948,** Email: rsusarp@myyahoo.com, 9849350555, 9515121467